తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యాపేట
యాదాద్రి భువనగిరి
ఆదివారం
26 జనవరి 2025
పేజీలు : 8

## అంగన్వాడీలకు గ్యాస్ బిల్లుల కటకట..
# కట్టెపోయే దిక్కాయే?

నాలుగు సంవత్సరాల నుండి గ్యాస్, కూరగాయల బిల్లులు లేవు

అంగన్వాడీ టీచర్లకు ఆర్థిక ఇబ్బందులు .. తీవ్ర ఒత్తిడి

అంగన్వాడీలపై సవితి తల్లి ప్రేమ ప్రదర్శిస్తున్న ప్రభుత్వం

మర్రిగూడ మండలంలో 47 అంగన్వాడి కేంద్రాల దీన గాథ



**మర్రిగూడ, జనవరి 25,( జనంసాక్షి) :** అంగన్వాడీలకు గ్యాస్ బిల్లుల కటకట.... కట్టెపోయే దిక్కాయే? నాలుగు సంవత్సరాల నుండి గ్యాస్, కూరగాయ బిల్లులు రాక అంగన్వాడీ టీచర్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు, అసలే చాలీచాలని జీతాలు దానికి తోడు సర్వేలు, ఓటర్ నమోదు ఇలా అనేక కార్యక్రమాలలో అంగన్వాడీలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు, అయినా ప్రభుత్వం వారిపై చిన్నచూపు చూస్తుంది, బండ చాకిరి చేయించుకుని అది చాలదన్నట్టు వారిపై ఆర్థిక భారం మోపుతున్న ప్రభుత్వం..

మర్రిగూడ మండలంలో 47 అంగన్వాడి కేంద్రాలలో గ్యాస్, కూరగాయల బిల్లులు నాలుగు సంవత్సరాలు నుండి రాకపోవడంతో అంగన్వాడీ టీచర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు,చిన్నారులకు ప్రీస్కూల్ సర్వీసులతోపాటు పౌష్టికాహారాన్ని అందిస్తుండగా.. గర్భిణులు, బాలింతలకు రోజూ అన్ని రకాల పోషకాలున్న వేడివేడి భోజనాన్ని అందిస్తున్నారు. ఈ భోజనాన్ని వండేందుకు అంగన్వాడీ కేంద్రాలకు గ్యాస్ సిలిండర్, పొయ్యిలను ప్రభుత్వం ఇచ్చింది. వీటిని ఉపయోగించి రోజువారీగా పోషకాహారాన్ని అందించే బాధ్యతను అంగన్వాడీ టీచర్లకు అప్పగించింది. అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని వడ్డించి పంపిణీ చేయడంలో గ్రామీణ కేంద్రాలే ముందు వరుసలో ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లోని ఎక్కువ శాతం కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని సరుకుల రూపంలో లబ్ధిదారులకు అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం వంట చేసి అప్పటికప్పుడు వడ్డిస్తున్నారు. సగటున రెండు నెలలకో సిలిండర్లు వినియోగిస్తున్నట్లు బిల్లులు




రాకపోవడంతో టీచర్లు వ్యక్తిగతంగా డబ్బులు చెల్లించి సిలిండర్లు తీసుకుంటున్నారు. ప్రభుత్వ బిల్లు చెల్లించి ఆదుకోవాలని అంగన్వాడి టీచర్లు కోరుతున్నారు,



కొండమల్లేపల్లి మండల పరిధిలో శనివారం ఉదయం పొగమంచు వర్షంలా పడుతోంది. శీతల గాలులు వెన్నులో వణుకు పుట్టించాయి. ఉదయం 9 గంటలు దాటినా మంచు దుప్పటి వీడలేదు. దీంతో రహదారులపై పొగమంచు దట్టంగా అలుముకోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు.దీంతో వాహనదారులు వాహనాల హెడ్‌లైట్స్ వేసుకొని ప్రయాణాలు చేశారు. గ్రామాలు, పట్టణం అనే తేడా లేకుండా అన్ని చోట్లా మంచు తెరలు దట్టంగా అలుముకున్నాయి.ఉదయాన్నే మస్జిద్ లకు, దేవాలయాలకు వెళ్లే భక్తులు, వ్యాయామం చేసే వారు, పాల వ్యాపారులు, పేపర్ బాయ్స్, సఫాయి కార్మికులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు చలికి గజగజ వణికిపోయారు.

### రోగుల ప్రాణాలు కాపాడే శక్తి
## డాక్టర్లకు మాత్రమే ఉంది

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్గొండ బ్యూరో జనవరి 25,జనంసాక్షి:** రోగుల ప్రాణాలను కాపాడేది డాక్టర్లు మాత్రమే అని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం ఆయన నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ ఆరోగ్య కార్యక్రమాల సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. డాక్టర్లను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ నల్గొండ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా రోగులకు మంచి వైద్య సేవలు అందించాలని,ప్రత్యేకించి దేవరకొండ,నాగార్జునసాగర్,మునుగోడు తదితర ఆస్పత్రులతో పాటు, అన్ని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన వైద్య సదుపాయాలను ఏర్పాటు చేస్తామని అన్నారు. అలాగే ఎక్కడైనా ఖాళీలు ఉంటే అవసరమైతే కాంటాక్ట్ పద్ధతిన భర్తీ చేయాలని జిల్లా కలెక్టర్ కు సూచించారు. వివిధ కారణాలతో ఆసుపత్రులకు వచ్చే రోగులను ప్రభుత్వ వైద్యులు మాత్రమే కాపాడగలరని అన్నారు. జిల్లాలోని వైద్యులు ఉత్తమమైన సేవలను అందించి ప్రజలకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్,గృహ నిర్మాణ పిడి రాజ్ కుమార్,డిఆర్డిఏ పిడి శేఖర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.



## విద్యార్థులే దేశానికి
# పట్టుకొమ్మలు..

భవ్యశ్రీ ని అభినందించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**భద్రాచలం జనవరి 25 (జనం సాక్షి):** విద్యార్థులే దేశానికి పట్టుకొమ్మలని, యువత తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. 15 వ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వకృత్వ , డ్రాయింగ్ , వ్యాసరచన పోటీలలో ప్రతిభను కనబరిచిన విద్యార్థిని విద్యార్థులుకు జిల్లా కలెక్టర్ జితిష్ వి పాటిల్ శనివారం బహుమతులు అందజేశారు. అందులో భాగంగా భద్రాచలం కొర్రాజుల గుట్ట నన్నపనేని పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్న విద్యార్థిని కంచర్లపల్లి భవ్యశ్రీ కి జిల్లా కలెక్టర్ చేతులమీదుగా అవార్డ్ అందించారు. ఓటు హక్కు ను వినియోగించుకోవాలని వ్యాసరచనలో

మిగతా4లో



## కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ బీఎల్ఓగా అవార్డు అందుకున్న బి ఎల్ ఓ లు

**తుంగతుర్తి జనవరి 25 (జనంసాక్షి)**
జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని తుంగతుర్తి మండలంలో ఐదుగురు అంగన్వాడి టీచర్లకు నిబద్ధతతో విధులు నిర్వహించినందుకు గాను శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ చేతులమీదుగా ఉత్తమ బీఎల్ఓ అవార్డులు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ప్రశంసా పత్రం అందుకున్న వారిలో అంగన్వాడి టీచర్లు ఏ అనిత. కే మంగమ్మ. కే అమృత. జి శోభ. డి ఉమామహేశ్వరి. సిహెచ్ రజిత లు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేము చేసిన సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసిన అధికారులకు, అందుకు సహకరించిన సీడీపీఓకు, ప్రజలకు, మా సహచర అంగన్వాడి టీచర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గూడ్స్ వాహనాలలో ప్యాసింజర్లను తరలించకూడదు




**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):**
ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం అన్నారు.జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద గూడ్స్ వెహికల్స్ లో ప్యాసింజర్స్ తరలించకూడదని అనే అంశంపై అవగాహన కల్పించారు. గూడ్స్ వెహికల్స్ లో ప్యాసింజర్లను తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రతి ఒక్కరు వాహనం నడిపే సమయంలో హెల్మెట్‌ను తప్పకుండా ధరించాలన్నారు.మైనర్‌లకు వాహనాలు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. రోడ్డు నియమాలను పాటించకుండా వాహనాలను ఒవర్ టేక్ చేయరాదని చెప్పారు.పాదచారులు జీబ్రా క్రాసింగ్ లైన్ల మీదుగా మాత్రమే రోడ్డు దాటాలని తెలిపారు. మోటార్ వెహికల్ యాక్ట్ రూల్స్ ప్రకారం విధులు సక్రమంగా పాటించాలని సూచించారు.

## రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి ఏఓ జానకి రాములు

**కొండమల్లేపల్లి, జనవరి 25 జనంసాక్షి :**
కొండమల్లేపల్లి మండల పరిధిలోని రైతులందరూ జనవరి 01 2025 తేది లోపు కొత్తగా పట్టా పాస్ బుక్కులు పొందిన రైతులందరు రైతు భరోసాకు ఏఈవోలకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జానకి రాములు కోరారు. పట్టా పాస్ పుస్తకాలు పొందిన రైతులు దరఖాస్తు ఫారం, పట్టాదారు పాస్ బుక్, ఆధార్, బ్యాంక్ ఖాతా జీరాక్స్ లను ఏఈవోలకు ఇచ్చి రైతు భరోసాను పొందాలని అన్నారు. వ్యవసాయ పెట్టుబడి సాయం కోసం ఇచ్చే రైతు భరోసాను రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



# గ్రామసభలలో గొడవలకు కారణం టీఆర్ఎస్ నాయకులే..

## దాసరి శ్రీను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు..



**తుంగతుర్తి జనవరి 25 (జనంసాక్షి)**
ప్రజా పాలన సందర్భంగా గ్రామాలలో ఏర్పాటుచేసిన గ్రామసభలలో రైతుల ముసుగులో టిఆర్ఎస్ కార్యకర్తలు సభలో గొడవలు సృష్టించారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దాసరి శ్రీను అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కి అడ్డుపడుతున్న ప్రతిపక్షాలు చేస్తున్న పనులను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు . లబ్ధిదారుల ఎంపిక కోసం జరుగుతున్న గ్రామ సభలలో గొడవలు చేయిస్తున్నది ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నాయకులేనని అన్నారు. టిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏ ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వలేదని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ లు ఇస్తామని చెప్పి పేద ప్రజలను మోసం చేసిన చరిత్ర వారికి దక్కిందన్నారు. పదేళ్ల తర్వాత గ్రామ సభలు జరుగుతుండటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. శుక్రవారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటుచేసిన గ్రామసభలో నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత స్థానిక శాసనసభ్యులు మందుల సామెల్ పై కావాలని కొంతమంది ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ దుష్ప్రచారం చేస్తూ అలజడి సృష్టించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.అది కూడా బీఆర్ఎస్ వాళ్ళు ఉద్దేశపూర్వకంగా చేశారని ఆరోపించారు. మందుల సామెల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటినుండి వందల కోట్ల రూపాయలతో నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేశారని, అది చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు ఎమ్మెల్యే పై అసత్య ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని అన్నారు. 10 సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్ పాలనలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు చెప్పిన వాళ్ళకే పథకాలు వచ్చేవని, ఫామ్ హౌస్ లో, ఎమ్మెల్యేలు ఇండ్లలో కూర్చొని లబ్ధిదారులను ఎంపిక చేసేవారిని విమర్శించారు.

కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో గ్రామ సభల్లోనే ప్రజల సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ప్రజాస్వామ్య బద్ధంగా లబ్ధిదారులను గుర్తిస్తుంటే కావాలని బీఆర్ఎస్ రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఓట్లప్పుడే పథకాలు అరకొరగా ఇచ్చేవారన్నారు. కానీ ప్రజా అవసరాలు, ఆర్థిక వనరులను బట్టి పథకాలను అమలు చేస్తున్నారని వెల్లడించారు. పదేళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వలేదని.. అందుకే ఉద్దేశపూర్వకంగా బీఆర్ఎస్ గొడవలు చేస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకుల మాయ మాటలు నమ్మి కొందరు ఆర్థిక, సామాజిక, రాజకీయ, కుల సమగ్ర ఇంటిటి సర్వేలో పాల్గొనలేదని.. ఇప్పుడు వాళ్ళకి పథకాలు రావనే ఆందోళన ఉందన్నారు. ఏ ఒక్క అర్హుడు నష్టపోకుండా ప్రజాపాలన దరఖాస్తులు తీసుకుంటున్నారని స్పష్టం చేశారు. ప్రకటించిన జాబితాలలో పేర్లు లేని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెబుతున్న తమ పేర్లు లేవని మొండిగా వాదించడం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు ఇప్పటికైనా బి.ఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యే పై, కాంగ్రెస్ పై అసత్య ఆరోపణలు మానుకోకుంటే ప్రజా క్షేత్రంలో తగిన గుణపాఠం చెప్తాం అది హెచ్చరించారు.

### గణతంత్ర దినోత్సవం రోజు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

## ఫోటో మాత్రమే పెట్టాలి

### దళిత సంఘాలు..

**మిర్యాలగూడ, జనవరి 25 (జనంసాక్షి)**
గణతంత్ర దినోత్సవం రోజు జరిపే జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో రాజ్యంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఫోటో మాత్రమే పెట్టాలని దళిత సంఘాల నాయకులు తాళ్ళపల్లి రవి,బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోథ్ దశరథ్ నాయక్, ఎస్సీ ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షులు మాదుగుల శ్రీనివాస్ లు కోరారు. శనివారం నాడు పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, రాజ్యాంగ రచన కమిటి చైర్మన్ అయిన బేద్కర్ నాటి నుండి నేటి వరకు ప్రజలకు ఏది అవసరమో రాజ్యాంగంలో పొందుపరిచి భారతదేశాన్ని ప్రపంచ పటంలో గొప్ప పేరు వుండేలా కృషి చేశారని చెప్పారు.రాజ్యాంగం అమలులోకి వచ్చే నాటికి గాంధీజీ మరణించారని ఆయన ఫోటోతో గణతంత్ర దినోత్సవం జరపడం సమంజసంకాదన్నారు. ప్రభుత్వం, అధికారులు గణతంత్ర దినోత్సవం సందర్భంగా విధిగా అంబేత్కర్ ఫోటో పెట్టేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు.విద్య,వైద్య సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు,వివిధ సంస్థలలో అంబేత్కర్ ఫోటో పెట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



## రామయ్య సేవలో సివిల్ సప్లై జాయింట్ సెక్రెటరీ ప్రియాంక అల

**భద్రాచలం జనవరి 25 (జనంసాక్షి):**
భద్రాద్రి రామయ్యను శనివారం డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్, జాయింట్ సెక్రటరీ ప్రియాంక అల దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్తంభ మధ్య నమస్కరించుకొని అంతరాలయంలోని మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీ తాయారమ్మవారి సన్నిధిలో అర్చకులు ఆమెకు వేదాశీర్వచనం చేసి, స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ వెంట ఆలయ ప్రధాన అర్చకులు అమరవాది విజయ రాఘవన్, ఆలయ ఈఈ రవీందర్ రాజు, తహసిల్దార్ తూమాటి శ్రీనివాస్, ఆర్ఐ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు




**భద్రాచలం, జనవరి 25 (జనం సాక్షి):**
ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది కాలంలోనే భద్రాచలం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అభినందనీయుడని పవర్ బాయ్స్ నాయకులు వల్లపు ప్రేమ్ కుమార్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పవర్ బాయ్స్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ప్రజా వైద్యుడిగా, విద్యావంతుడిగా అత్యధిక మెజార్టీతో గెలిచిన వెంకట్రావు ఏజెన్సీ వ్యాప్తంగా నిరంతరం పర్యటిస్తూ సామాన్య ప్రజలకు పాలనను చేరువ చేశారని అన్నారు. ప్రత్యేకంగా యువజన రంగంపై దృష్టి సారించి యువతి యువకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వినాయక చవితి, దసరా ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖను ఇతర శాఖలను అప్రమత్తం చేసి ఉత్సవాలను విజయవంతం చేసి, యువకుల మనసులో శాశ్వత స్థానాన్ని ఎమ్మెల్యే పొందారని కొని ఆడారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువా తో సత్కరించి పుష్పగుచ్చాలు అందజేసి,కేకు కట్ చేసి మిఠాయిలు పంచారు. తనను అభినందించడానికి వచ్చిన యువకులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోనే అత్యంత వైభవంగా వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్న ఘనత పవర్ బాయ్స్కే దక్కుతుందని అన్నారు.నేటి రాజకీయాలకు యువతే కీలకమని, దేశ సమగ్రతను కాపాడేందుకు యువకులు రాజకీయాలలోకి రావాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు కోరారు. ఈ కార్యక్రమంలో పవర్ బాయ్స్ సభ్యులు సందీప్ శతకీర్తి, సతీష్, సంతోష్, సాయి వర్మ, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

- ✧ ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- ✧ విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన
- ✧ విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ



**దేవరకొండ, జనవరి 25 (జనంసాక్షి)**
దేవరకొండ పట్టణంలో రెవెన్యూ డిపార్ట్మెంట్,స్పోర్ట్స్ అసోసియేషన్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వారి ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ పి మౌనిక ఐపీఎస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా స్థానిక డిండి చౌరస్తా నుండి బస్టాండ్ వద్దకు ర్యాలీ నిర్వహించారు. ఆర్డిఓ ఎస్. రమణారెడ్డి, ఏ ఎస్పి మౌనిక పాల్గొని విద్యార్థులకు ఓటు ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటుని నోటుకు అమ్ముకోవద్దని, ఓటే వజ్రా యుధమని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎస్ఏ అధ్యక్షుడు ఎన్విటి, తాసిల్దార్ సంతోష్ కిరణ్, సీఐ నరసింహులు, కమిషనర్ సుదర్శన్, ఎంపీడీవో డేనియల్,ఎంఈఓమాతృనాయక్, రాజకుమార్ రెడ్డి, అయూబ్, బత్తుల అమర్, తాళ్ల సురేష్, పొన్నబోయిన సైదులు, మొహమ్మద్ అన్వర్ హుస్సేన్ , చరణ్, డాన్స్ మాస్టర్ జగన్, నాగర్జున, కృష్ణ, హనుమంత్, నాగరాజు, హరి ,రాము, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కోదాడ మున్సిపల్ పాలకవర్గానికి ఘనంగా సన్మానం

**కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి**



**కోదాడ టౌన్ జనవరి 25 (జనంసాక్షి):**
పదవి ఉన్నా లేకున్నా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని గుడుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్ లో కోదాడ మున్సిపల్ పాలకవర్గం ముగుస్తున్న సందర్భంగా చైర్మన్ సామినేని ప్రమీల ఆధ్వర్యంలో వారిని శాలువా పూల బొకేలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోదాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు పాలకవర్గం అన్ని విధాలుగా కృషి చేసిందని గత ఐదు సంవత్సరాలుగా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ఎంతో కష్టపడి పనిచేశారని ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. కరోనా మహమ్మారి, ఇటీవల వచ్చిన వరదల్లో మున్సిపల్ అధికారులు, పాలకవర్గం, పారిశుద్ధ్య కార్మికులు తమ శక్తి వంచన లేకుండా అన్ని విధాలుగా పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి పట్టణ ప్రజల మన్ననాలను పొందారన్నారు. ప్రజాసేవకు విరమణ ఉండదు అని పదవి ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏవైనా సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే తప్పక పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, కమిషనర్ రమాదేవి పాలకవర్గ సభ్యులు మున్సిపల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నేటితో ముగియనున్న కౌన్సిలర్ల పదవి కాలం

**మరుసటి రోజు నుండి అంతా మాజీ లే..**

**అనంతరం ఎన్నికల నిర్వహణనా.. లేదా ప్రత్యేక పాలననా**



తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ పాలకవర్గం పదవి కాలం నేటితో (ఈనెల 26) తో ముగియనుంది. ఈ క్రమంలో దేవరకొండ మున్సిపాలిటీలో ఓ చైర్మన్,ఓ వైస్ చైర్మన్, 18 మంది కౌన్సిలర్లు పదవులు వీడనున్నారు.
ఆదివారంతో వీళ్ళ పదవీకాలం తీరుతుంది. ఆ మరుసటి రోజు నుండి వీళ్లంతా మాజీలు కానున్నారు. చివరి రోజు గణతంత్ర దినోత్సవం కావడంతో మున్సిపల్ కార్యాలయంలో జాతీయ పతక ఆవిష్కరణను పాల్గొననున్నారు. అయితే రానున్న ఎన్నికల్లో అధికారం చేపట్టడానికి ఆశావాహులు ఇప్పటికే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. గడువు ముగిసిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ చేపడుతుందా..లేదా ప్రత్యేక పాలన అందిస్తుందా అనే సందేహంలో ప్రజలు ఉన్నారు.

జనంసాక్షి @ దేవరకొండ



# ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధంలాంటిది

**తుంగతుర్తి జనవరి 25 (జనంసాక్షి)**
ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాజా మోహన్ రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటర్ దినోత్సవ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థుల చేత ఓటర్ ప్రతిజ్ఞ నిర్వహించి మెయిన్ రోడ్ పై ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారు తప్పనిసరిగా ఓటరు నమోదు చేసుకోవాలని అన్నారు ఈ మేరకు విద్యార్థులకు ఓటర్ నమోదుపై అవగాహన కల్పించారు అనంతరం విద్యార్థులచే ఓటర్ నమోదు పై ప్రతిజ్ఞ చేయించారు అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పుల్లయ్య గణేష్ మరియు అధ్యాపకులు మధుకర్,నాగయ్య ,భగత్ సింగ్ ప్రవీణ్ ,రాంబాబు ,ప్రదీప్ నాగేశ్వరావు ,అనిత ,దయాకర్ సంతోష్ , సోనిప్రియ మరియు అధ్యాపకేతర బృందం బిక్షం వీరయ్య ,ఆరిఫ్ భూమన్న మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతు మహా ధర్నాను విజయవంతం చేయాలి



**కనగల్లు. జనవరి 25 (జనంసాక్షి):**
ఈనెల 28న నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్లో నిర్వహించే రైతు మహా ధర్నాను రైతులు అధిక సంఖ్యలో పాల్గొనివిజయవంతం చేయాలని కనగల్ మాజీ ఎంపీపీ కరీం పాషా శనివారంపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు కేటీఆర్. జగదీష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలి పారు. ఈ కార్యక్రమంలో కనగల్ పిఏసిఎస్ చైర్మన్ వంగాల సహదేవరెడ్డి మండల పార్టీ అధ్యక్షులు యాదయ్య గౌడ్ రేగట్టే మాజీ సర్పంచ్ కడారి కృష్ణయ్య పగిడిమర్రి మాజీ ఎంపీటీసీ సుంకిరెడ్డి వెంకటరెడ్డి లు ఉన్నారు.

# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల రాష్ట్ర రెండవ మహాసభను జయప్రదం చేయండి – టీయుసిఐ

**సింగరేణి డిపార్ట్మెంట్లలో మహాసభలకు, ముద్రించిన కరపత్రాల ఆవిష్కరణ : షేక్ యాకుబ్ షావలి**





**ఇల్లందు జనవరి 25 జనంసాక్షి:**
బొగ్గు పరిశ్రమల్లో దేశవ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు 2013 నుండి అమలు జరుగుతున్నాయన్నారు. సింగరేణిలో మాత్రం గత పది సంవత్సరాల ప్రభుత్వంలో నయా పైసా పెంచిన పాపన పోలేదని, ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, టి యు సి ఐ రాష్ట్ర అధ్యక్షులు, షేక్ యాకుబ్ షావలి అన్నారు. ఈనెల 31న శుక్రవారం రోజు ఇల్లందు, ఎల్లన్న భవనంలో, ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్, వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర రెండవ మహాసభను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అనంతరం, సింగరేణి కాంటాక్ట్ కార్మికుల డిపార్ట్మెంట్ అడ్డాలలో మహాసభకు ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ
చిన్న జీతంలో కాంట్రాక్టు కార్మికుల దగ్గర సీఎం పిఎఫ్ కట్ చేస్తున్నారన్నారు. కానీ వారి సీఎం పిఎఫ్ లో ఎంత జమయిందో తెలుపకపోవడం బాధాకరమన్నారు. కన్వీనియన్స్ టెండర్లు మారుతున్నాయని, కొత్త టెండర్లు పిలుస్తున్నారు. ఆ డ్రైవర్ కి ఉద్యోగం ఉంటది ఉండదు ఇప్పటిదాకా కట్ చేసిన పైసలు హోల్డ్ లో పెట్టిన మంటున్నారు. డ్రైవర్ ఉద్యోగం లేకపోయినా సింగరేణి చుట్టు తిరుగుతూనే ఉండాల్సిన పరిస్థితి దాపురించక ముందే వెంటనే ఈ సమస్యను పరిష్కారం చేయాలన్నారు. జాప్యం జరిగితే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ఆయన అన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు సింగరేణిలో పెంచేందుకు గత ప్రభుత్వం ముఖం చాటేసింది. వాగ్దానాలతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం జాప్యం చేస్తున్నది. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం జీతాలు పెంచే నిర్ణయం తీసుకోకపోతే కలిసొచ్చే సంఘాలతో కలుపుకొని పెద్ద ఎత్తున కార్మికులను పోరాటాలకు సిద్ధం చేస్తామన్నారు. అందుకు ఇల్లందులో ఈనెల 31న జరుగు సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సభలో చర్చించి భవిష్యత్ పోరాట కర్తవ్యాలను రూపొందించేందుకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనే జయప్రదం చేయాల్సిందిగా సింగరేణిలో అన్ని రకాల కాంట్రాక్టు కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ టి యు సి ఐ ఇల్లందు ఏరియా కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు, కార్యక్రమంలో సింగరేణి కన్వీనియన్స్ డ్రైవర్ల యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి, రెడే బోయిన గోపి, బ్రాంచ్ నాయకులు, చంద్రమోహన్, రమేష్, తరుణ్ గాదె రాజేశ్వరి, విజయ, లింగమూర్తి, సైదా మల్లేశ్వరి, ఉపేందర్, నిర్మల శేఖర్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

**కొండమల్లేపల్లి, జనవరి 25 జనంసాక్షి :**
జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కొండమల్లేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో శనివారం ప్రజాస్వామ్య పండుగ సందర్భంగా కారోబార్స్ బిల్ కలెక్టర్స్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యజ్ఞ నారాయణ ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించి అవగాహన కల్పించారు అనంతరం వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి ఓటు నవ భారతాన్ని నిర్మిస్తుందని భారతదేశం పురోగతి, అభివృద్ధి ఓటర్ల ఓటు ద్వారా మాత్రమే నిర్ణయించడం జరుగుతుందన్నారు.జాతీయ ఓటరు దినోత్సవానికి దాని స్వంత ప్రత్యేక కారణం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్క ఓటరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవడం జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రధాన ఉద్దేశం అని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఎల్ఓలు అందుగుల ప్రవీణ్, పొట్ట లక్ష్మణ్, గ్రామ పంచాయతీ సిబ్బంది కోట్ల సతీష్ పటేల్, రేణుక, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

- ఓటు విలువైనది దానిని దుర్వినియోగం చేయొద్దు
- ఓటు హక్కు ప్రజాస్వామానికి ప్రాణం
- ప్రతి వ్యక్తికి ఓటు ఒక వజ్రాయుధం









**మణుగూరు, జనవరి 25 (జనంసాక్షి):** యువత ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని మణుగూరు సబ్ డివిజనల్ అధికారి రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మణుగూరు తహసిల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....జాతీయ ఎలక్షన్ కమిషన్ ఏర్పడి 70 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో నేడు ఓటర్ దినోత్సవం జరుపుకుంటు న్నామని అన్నారు. 1950లో భారత ఎన్నికల సంఘం స్థాపించిన రోజును గుర్తు చేసుకుంటూ ప్రతి ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ దినోత్సవం నిర్వహిస్తారు. ఎన్నికలలో ఓటర్లను భాగస్వామ్యం చేసేందుకు ఓటింగ్ ప్రాముఖ్యతను తెలపడం కోసం 2011 నుంచి ఈ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉన్న నేపథ్యంలో వారిని ఓటింగ్ వైపు ప్రోత్సహించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. చాలామంది అర్హత గల యువత ఓటర్లుగా నమోదు చేసుకోవడం లేదని అప్పటి కేంద్ర ప్రభుత్వం గుర్తించింది ఈ సమస్యను అధిగమించేందుకు చొరవ చూపింది మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నేతృత్వంలో ఓటర్లుగా నమోదు చేయడం ఓటర్ గుర్తింపు కార్డు మంజూరు చేయడంపై దృష్టి పెట్టిందన్నారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క వ్యక్తి ఓటు హక్కును వినియోగించుకోవాలని.. అలాగే ఈ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును వినియోగించు కొని ఓ మంచి ప్రజా ప్రతినిధిని ఎన్నుకోవాలని తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మణుగూరు పెద్దిపల్లి లోని గుత్తి కోయ లకు చెందిన కొత్త ఓటర్ లకు ఎపిక్ కార్డు ఇచ్చి, శాలువా తో సత్కరంచారు. అలాగే బి ఎల్ ఓ లన్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు తహసిల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడిఓ శ్రీనివాస్ రావు, సీఐ సతీష్ కుమార్, ఎస్సై మేడ ప్రసాద్. ఎంపీఓ వెంకటేశ్వర రావు, మున్సిపల్ కమిషనర్, మండల అధికారులు, నాయకులు, ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా పారిశుధ్య నిర్వహణ పనులు









**కల్లూరు జనవరి 25 (జనంసాక్షి):** కల్లూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎన్ఎస్పి క్రాస్ రోడ్ నుంచి కల్లూరు పట్టణ మెయిన్ సెంటర్ వరకు పలు ప్రాంతాలలో ఈవో నంది శెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది శనివారం ముమ్మరంగా పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్ఎస్పి పరిసర ప్రాంతాలలో రహదారుల పక్కన ఏర్పడిన గుంతలలో గ్రావెల్ తోలించి డోజర్ సహాయంతో లెవలింగ్ చేయించారు. అదేవిధంగా అపరిశు భ్రంగా ఉన్న పరిసరాలను శు భ్రపరచడం చెత్తాచెదారం తొలగింపు చర్యలు చేపట్టారు. , త్రాగునీటి పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు చేయించారు. హైవే ప్రధాన రహదారి మధ్యలో గల డివైడర్ కి ఇరువైపులా పేరుకుపోయిన మట్టినీ,డివైడర్ పైన ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డ్ కు తరలించారు. , టీఎస్ రెసిడెన్షియల్ హాస్టల్ పక్కన హైవే రహదారి సమీపంలో దుర్వాసన వెదజల్లుతూ డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం మురుగునీటి నిల్వలను జెసిబి ద్వారా తొలగించారు. పలు ప్రాంతాలలో అస్తవ్యస్తంగా ఉన్న ప్లాస్టిక్ కవర్లను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉమామహేశ్వర దేవస్థానంలో ప్రత్యేక పూజలు



**చిట్యాల జనవరి 25 (జనంసాక్షి):** చిట్యాల మండలంలో పెద్ద కాపర్తి గ్రామం లో శ్రీశ్రీశ్రీ ఉమ మహేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం నాడు స్వామివారికి మైల సత్తయ్య ఆధ్వర్యంలో అభిషేకం నిర్వ హించిన విశ్రాంత జడ్జి గోవర్ధన చారి అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమామహేశ్వర దేవాలయం అభివృద్ధికి నాతో పాటు ప్రముఖులు తమ శక్తి మేరకు విరాళాలు అందించి దేవాలయ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు భవిష్యత్తులో ఈ దేవాలయంలో నిత్య పూజలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు తాటి చంద్రమౌళి, సిలువేరు నరసింహా మోరా రాములయ్య,నరసింహ,రామలింగం తదితరులు పాల్గొన్నారు.

# బస్సు భవనకు వందలాదిగా కార్మికులు తరలిరావాలి

## రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి.అప్పారావు




**ఖమ్మం, (జనంసాక్షి):**
ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించ తలపెట్టిన సమ్మెకు సంబంధించి నోటీసులు రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చేందుకు ఈనెల 27న కార్మికులు అధిక సంఖ్యలో బస్సు భవన్ కు తరలిరావాలని టి జి ఎస్ ఆర్ టి సి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు పిలుపునిచ్చారు. టీజీఎస్ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం రీజియన్ కౌన్సిల్ సమావేశం శనివారం సిపిఐ ఆఫీస్ గిరి ప్రసాద్ భవన్ లో ఎంప్లాయిస్ యూనియన్ రీజియన్ అధ్యక్షులు గుడిబోయిన శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి.అప్పారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గత 12 నెలలుగా అనేక పోరాట కార్యక్రమాలు నిర్వహించిన ఈ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించుటలేదని విమర్శించారు. కాలుష్య రహిత ఎలక్ట్రికల్ బస్సుల పేరుతో జేబీఎం అల్ట్రాటెక్ ప్రైవేట్ సంస్థల బస్సులను ఆర్టీసీలోకి తీసుకొని వచ్చి ప్రవేశ పెట్టడం వలన సమస్త మనుగడకే ప్రమాదం వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సంస్థ కె కేటాయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేసి ఇవ్వాలని కోరారు. ఎలక్ట్రికల్ బస్సులలో కండక్టర్, డ్రైవర్ తో పాటు మెయింటెనెన్స్ సిబ్బంది కూడా ఆర్టీసీ వారే ఉండాలని అన్నారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాల సవరణ చేయాలని, 2021 వేతన సవరణ చేయాలని, 2017 వేతన సవరణ బకాయిలతో పాటు అన్ని డి ఏ ల ఏరియర్స్ బకాయిలను చెల్లించాలని, చనిపోయిన ఉద్యోగులు, మెడికల్ అన్ఫిట్ అయిన ఉద్యోగుల పిల్లలకు ఇచ్చే ఉద్యోగాలను రెగ్యులర్ ప్రాతిపదికన ఇవ్వాలని, గత ప్రభుత్వ విధానాల వల్ల ఉద్యోగాలు కోల్పోయిన ఉద్యోగులందరికీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేసినారు. రీజియన్ కార్యదర్శి పిల్లి రమేష్ మాట్లాడుతూ రీజియన్ వ్యాప్తంగా అన్ని డిపోలలో యాజమాన్యం కిలోమీటర్లను పెంచి మూడు రోజుల పని దినాలను రెండు రోజులకు కుదిరించడం వలన కార్మికుల పై పని ఒత్తిడి పెరిగి ఆరోగ్యాలు పాడవుతున్నాయని, రీజనవ్యాప్తంగా ఉన్న ఖాళీలను భర్తీ చేయకపోవడం వలన అన్ని కేటగిరీల కార్మికులపై తీవ్రమైన పని ఒత్తిడి పెరుగుతుందని అన్నారు. రీజినల్ మేనేజర్ దగ్గర, డిప్యూటీ రీజినల్ మేనేజర్ దగ్గర ఉన్న అన్ని రకాల కార్మికుల అప్పీలను వెంటనే క్లియర్ చేయాలని కోరినారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రీజనల్ మేనేజర్ గారు సానుభూతితో పరిశీలించాలని లేనియెడల సమస్యల కోసం పోరాడవలసి వస్తుందని తెలియజేసినారు. ఈ సమావేశంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణ కుమారి, రాష్ట్ర కార్యదర్శులు తిమ్మినేని రామారావు,కందుల భాస్కరరావు, గూడూరు సత్యనారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరు రామచంద్రరావు మరియు ఏడు డిపోల అధ్యక్ష కార్యదర్శులు దేశ బోయిన జగన్నాథం,బేతంపూడి బుచ్చిబాబు, గోపాల్ రావు, షేక్ నాగుల్ మేరా, రమేష్ బాబు ఆర్ఎన్ . సింగ్, విజయ్ కుమార్, రమణ రావు, అనిత, సలోమి, పద్మ, దామాల.లాజర్,పెద్దిపాక. వెంకటేశ్వర్లు,జుజ్జుకూరి.కిరణ్ కుమార్ తో పాటు 60 మంది కార్మికులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న నాలుగు సెల్ ఫోన్లన అందజేసిన సీఐ మురళీ

◆ సంతోషం వ్యక్తం చేసిన బాధితులు




**ముదిగొండ, జనవరి 25, (జనంసాక్షి):** ముదిగొండ మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ లో శనివారం బాధితులు పోగొట్టుకున్న 4 మొబైల్ ఫోన్లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పట్టుకొని బాధితులకు అందజేసినట్లు సీఐ మురళీ తెలిపారు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేశారన్నారు వారికి తిరిగి అందజేసినట్లు పోలీసులు తెలిపారు ఈ సందర్భంగా బాధితులు పోలీసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఆర్థిక సహాయం అందజేత



**చిట్యాల జనవరి 25 (జనంసాక్షి):** చిట్యాల మండలము నేరడ గ్రామంలో ఇటీవల కాలంలో మందుగుళ్ళ యాదయ్య అనారోగ్యంతో మరణించడం జరిగింది. అయ %శ్రీ%నది బీద కుటుంబం కావడంతో వృత్తిరీత్యా డ్రైవర్ కాబట్టి శనివారం నాడు తోటి డ్రైవర్లు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు ముప్పై వేల రూపాయల ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లారీ డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఓటర్ దినోత్సవ వేడుకలు..



చిట్యాల జనవరి 26 (జనం సాక్షి) చిట్యాల పట్టణంలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఓటర్ల ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీ నిర్వహించి బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కృష్ణా నాయక్, నాయబ్ తహసిల్దార్ విజయ, ఆర్ఐ జాని షరీఫ్, అమర్నాథ్ రెడ్డి మండల విద్యాధికారి పానుగోతు సైదా నాయక్, ప్రధానోపాధ్యాయులు జి మాధవి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, బిఎల్వోలు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**చర్ల జనంసాక్షి :** మండలం లోని కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు. ఈ జన్మదిన వేడుకలను టిపిసిసి సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్ మరియు మండల అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి సీనియర్ నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ పోలిన లంక రాజు నేతృత్వంలో జరిపారు. మండల నాయకులు కార్యకర్తలు తెల్లం వెంకట్రావు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బూరుగడ్డ బసవయ్య, కుమార్ రాజా, మడకం పద్మ, ఇందల బుచ్చిబాబు, తడికల లాలయ్య, ఇర్ప శ్రీనివాస్, ముమ్మినేని అరవిందు, బ్రహ్మానంద రెడ్డి, పటేల్ వెంకటేశ్వర్లు, ఇర్ప వసంత ఈశ్వర్, సిరి వరపు శివకుమార్, గుండెపుడి భాస్కరరావు, తాటి రామకృష్ణ, సాల్మన్ రాజ్,, కోడి రెక్కల వెంకట్, చంటి, ముత్యాల వరప్రసాద్, కాకర్ల బాబి, యాలం రమేష్ లోహిత్, పందు, గోసుల మురళి, రావుల సతీష్, పొగాకు సత్తిబాబు, భాస్కరు, వర ప్రసాదు, అలవాల సతీసు, మచ్చ రాజా, రామ్మూర్తి, భద్రం, కర్రీ సంతోష్, చింతయ్య, సుమన్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ రుంజా రాజా తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల లబ్ధి కోసమే

★ పథకాల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్న ప్రభుత్వం

★ పథకాల పేరుతో గ్రామ సభల్లో ప్రచార ఆర్భటమే తప్ప ఏమీ లేదు..

★ గుండు వెంకటనర్సు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి



**మోత్కూర్ జనవరి 26 జనంసాక్షి :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల లబ్ధి కోసమే, పథకాల పేరుతో ప్రభుత్వం, ప్రజలను గందరగోళానికి గురిచేస్తుందని, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు విమర్శించారు. ఆయన మోత్కూర్ లో పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డులు, ఇండ్ల కోసం ఎదిరి చూస్తున్న ప్రజలకు, ప్రజాపాలన పేరుతో ధరకాస్తులు స్వీకరించి, అధికారులు సర్వే చేసి గ్రామ సభల్లో పెట్టిన లబ్ధిదారుల జాబితాల్లో అనర్హుల పేర్లే ఎక్కువగా ఉండి, అర్హులైన వారి పేర్లు లేకపోవడం వల్ల ఎంతోమంది అర్హులైన పేదలు ఆందోళనలకు గురివుతున్నారని అన్నారు. ఇప్పటికయినా అధికారులు, ప్రభుత్వం స్పందించి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికే సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

## డిజిటల్ మోసాలపై అవగాహన కార్యక్రమం..

◆"మోసపోయే ముందు ఆలోచించు, విచారించు"

◆"నీ డేటా నీ బాధ్యత" ఆదమరిస్తే సొమ్ము గుల్ల..

◆"జాగ్రత్తగా ఉంటే సైబర్ మోసాల నుంచి తప్పించుకోవచ్చు"

◆అనుమానం వస్తే సంబంధిత అధికారులను సంప్రదించాలి..




**మణుగూరు, జనవరి 25 (జనంసాక్షి):** ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ మోసాలు ప్రస్తుతం ఒక ప్రధాన సమస్యగా మారాయి. వ్యక్తిగత డేటా దోపిడీ, ఫిషింగ్ మెయిల్స్, ఆన్లైన్ ఫ్రాడ్లు, ఫేక్ ఆఫర్లు వంటి అంశాలతో ఆశ కల్పించి ప్రజలను ఆకర్షించి మోసాలకు పాల్పడుతున్నారు. శనివారం మణుగూరు పట్టణంలో ఎస్బిఐ బ్యాంక్ ఆధ్వర్యంలో డిజిటల్ మోసాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నగదు బదలీ నిల్వ చెల్లింపులకు ఎక్కువ సమయం పట్టేది రోజు రోజుకు వినియోగదారులు పెరిగి బ్యాంకింగ్ సేవలు అందించటంలో ఆలస్యం అవుతుంది. ఈ నేపథ్యంలో డిజిటల్ విధానాన్ని తీసుకురావడం జరిగింది. దీనివల్ల ప్రజలకు సేవలను సులభంగా, వేగంగా, పారదర్శకంగా అందించడమే. దీని ముఖ్యోద్దేశం. ఈ విధానం ముఖ్యంగా ప్రభుత్వ సేవలలో, వ్యాపార లావాదేవీలలో, విద్య, ఆరోగ్యం, బ్యాంకింగ్ వంటి రంగాలలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

**డిజిటల్ సేవల ముఖ్య ఉద్దేశ్యాలు:**

లావాదేవీలు ఆన్లైన్లో పారదర్శకత తో అవినీతి తగ్గుతుంది. సమయం ఆదాతో పాటు సేవలు సమాచారం తక్షణమే అందుబాటులో ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా సేవలు సులభతరం అవుతుంది. డిజిటలైజేషన్ వల్ల పేపర్వర్క్ తగ్గుతుంది, పర్యావరణానికి మేలు. ఆర్థికాభివృద్ధి డిజిటల్ విధానాలు ఆర్థిక వ్యవస్థను మెరుగు పరచడంలో సహాయపడతాయి. స్మార్ట్ఫోన్లు, ఇంటర్నెట్ వంటి సాంకేతికతను ఉపయోగించి అందరూ డిజిటల్ సేవలను సులభంగా వినియోగించుకోవచ్చు.

**డిజిటల్ మోసాల్లో రకాలు:**

ఫిషింగ్ ( ఫేక్ బ్యాంక్ లింక్ ద్వారా పాస్వర్డ్ అడగడం.), స్మిషింగ్ (ఎస్ఎంఎస్ ద్వారా మోసపూరిత లింకులు పంపించడం.) విషింగ్ (ఫోన్ కాల్స్ ద్వారా వ్యక్తిగత సమాచారం దొంగిలించడం.)

క్రెడిట్ కార్డ్ / డెబిట్ కార్డ్ మోసాలు

మాల్వేర్ దాడులు(వైరస్ లేదా మాల్వేర్ ద్వారా డేటాను హ్యాక్ చేయడం)

ఫేక్ ఆన్లైన్ షాపింగ్ వెబ్సైట్లు.

ఉదాహరణ: డబ్బు తీసుకుని వస్తువు పంపకపోవడం. సోషల్ మీడియా మోసాలు

8. ఐడెంటిటీ తస్కరణ అనగా పాన్ కార్డ్ లేదా ఆధార్ కార్డ్ వినియోగించి లావాదేవీలు చేయడం. సంస్థలో పనిచేసే వ్యక్తులు డేటాను బయటకు విక్రయించడం లేదా దుర్వినియోగం చేయడం.

ఫేక్ క్రిప్టోకరెన్సీ పెట్టుబడుల స్కీమ్లు లేదా వాలెట్ హ్యాకింగ్

సిమ్ కార్డ్ను డూప్లికేట్ చేయించి బ్యాంక్ ఓ టి పీ లను పొందడం.

ఫేక్ పెట్టుబడులు లేదా పిరమిడ్ స్కీమ్లు.

**రియల్ ఎస్టేట్ మోసాలు:**

ఫేక్ ప్రాపర్టీ లిస్ట్లు లేదా ప్రాపర్టీ కొనుగోలులో మోసం.

**ఫేక్ లాటరీ & గిఫ్ట్ స్కామ్లు:**

లాటరీ గెలిచారని చెబుతూ డబ్బు అడగడం. డీప్ ఫేక్ మోసాలు టెక్నాలజీ ఉపయోగించి వీడియోలు లేదా ఆడియోను ఫేక్ చేయడం.

**మోసాల నివారణ కోసం సూచనలు:**

అపరిచిత లింకులు క్లిక్ చేయకూడదు. ఫోన్ కాల్స్ ద్వారా ఓటిపి లు చెప్పకూడదు. సురక్షిత పాస్వర్డ్లు ఉపయోగించాలి. బ్యాంక్ అప్లికేషన్లను అధికారిక వెబ్సైట్ల నుండి మాత్రమే డౌన్లోడ్ చేయాలి. ఆన్లైన్ లావాదేవీలు చేయడంలో జాగ్రత్తగా ఉండాలి. మీకు ఇలాంటివి గురించి మరింత సమాచారం కోసం సంబంధిత బ్యాంక్ అధికారులను అడిగి తెలుసుకోవాలి. ఫైర్వాల్లు, యాంటీ వైరస్ సాఫ్ట్వేర్లు గురించి అవగాహన కల్పించడం. టోల్-ఫ్రీ నంబర్లు సైబర్ క్రైమ్కు సంబంధించి ప్రజలు వెంటనే సహాయం పొందేందుకు టోల్-ఫ్రీ నంబర్ను ప్రోత్సహించడం (ఉదా1930). రియల్-టైమ్ డెమోస్: ఫిషింగ్ వెబ్సైట్లు, ఫేక్ మెసేజ్లు గుర్తించేందుకు ప్రాక్టికల్ డెమో లో పాల్గొనాలి. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజలు వినియోగదారులు పాల్గొన్నారు.

## సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

**జెండా ఆవిష్కరణలో డబ్బికార్ మల్లేష్**



**మిర్యాలగూడ, జనవరి 25 (జనం సాక్షి):**
ఈనెల 25 నుంచి 28 తేదీ వరకు సంగారెడ్డిలో జరిగే సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ కోరారు. మహాసభల సందర్భంగా శనివారం సాయంత్రం స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయం పై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 28 వరకు మహాసభలు జరుగుతాయని రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు చేపట్టిన ఉద్యమాలు పోరాటాలు చర్చిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తామని చెప్పారు. ఈ మహాసభలకు ఎంతో ప్రాధాన్యత ఉందని తెలిపారు. కార్మిక, కర్షక, ఉద్యోగ నిరుద్యోగ మహిళల సమస్యల పరిష్కారం కోసం ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు రవి నాయక్, సిపిఎం వన్ టౌన్ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి, సీనియర్ నాయకులు సత్యనారాయణ రావు, నాయకులు పాదూరి గోవర్ధన, అరుణ, మాధవరెడ్డి, పల్లా బిక్షం, శ్రీను, రామారావు, వెంకన్న, పాషా తదితరులు పాల్గొన్నారు.

## అటవీ సంపాదను రక్షించాలి

- అడవి జంతువులను వేటాడితే కఠిన చర్యలు
- అటవీ భూములను సంరక్షించాలి
- డీఎఫ్ వో కృష్ణగౌడ్



**ఆళ్లపల్లి జనవరి 25 (జనంసాక్షి)**
అటవీ సంపదను,భూములను సంరక్షించాలని డిఎఫ్ వో కృష్ణ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఎఫ్ డి ఓ బాబురావు ,రేగళ్ల రేంజర్ జశ్వంత్ ,ఆళ్లపల్లి రేంజర్ కిరణ్ ఆధ్వర్యంలో నాలుగు రేంజ్ పరిధిలో పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. అడవిలో నీటి గుంటలను పరిశీలించడం జరిగిందని తెలిపారు. వేటగాళ్లు జంతువుల కోసం ఉచ్చులు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా అడవిలో చెట్లను నరికితే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఎరాగడీ వంటివి పెడితే అటవీ సంపద తీవ్ర నష్టం జరుగుతుందని ఫారెస్ట్ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవి అధికారులు భాస్కర్, సురేష్, నారాయణ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## గుర్రంపోడు మండలం ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

**గుర్రంపోడు మండలం బీసీ సంఘం అధ్యక్షులు రావుల సైదులు. (గౌడ్) జై హింద్!**



**గుర్రంపోడు మండలం జనవరి 25 (జనంసాక్షి):**
గుర్రంపోడు మండలం బీసీ సంఘం అధ్యక్షులు రావుల సైదులు గౌడ్లి ఈ రోజు మన స్వేచ్ఛను కాపాడుకోవడానికి మరియు మన దేశాన్ని సార్వభౌమ, ప్రజాస్వామ్య గణతంత్రంగా నిర్మించడానికి మహానుభావులు చేసిన త్యాగాలను స్మరించుకుందాం.మన దేశాన్ని రక్షించడం అంటే కేవలం సరిహద్దులను కాపాడుకోవడం మాత్రమే కాదు.మన రాజ్యాంగంలో పొందుపరచబడిన న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం యొక్క విలువలను ప్రజలందరూ తెలుసుకునేలా పాటుపడడం మన బాధ్యతని గుర్తుచేసుకుందాం. రాజ్యంగా విలువలను ప్రజలందరికీ పంచుదాం. ఎందరో స్వతంత్ర సమరయోధులు అమరవీరులు ఫలితమే భారతీయుల స్వేచ్ఛ వారి స్ఫూర్తితో ముందుకు సాగుదాం గణతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు.

## ఇల్లందులో కాంట్రాక్టు కార్మికుల సభను జయప్రదం చేయండి

**సింగరేణి హైటెక్ కాలనీలో కరపత్రాలు ఆవిష్కరణ లి టి యు సి ఐ**



**టేకులపల్లి, జనవరి 25 (జనంసాక్షి):**
ఇల్లందులో కాంట్రాక్ట్ కార్మికుల మహాసభను జయప్రదం చేయాలని టి యు సి ఐ టేకులపల్లి ఏరియా కార్యదర్శి జరుపుల సుందర్, కాంట్రాక్ట్ వర్కర్స్ ఏరియా నాయకుడు షేక్ షఫీ పిలుపునిచ్చారు. శనివారం సింగరేణి హైటెక్ కాలనీ సివిల్ ఆఫీస్, కాంట్రాక్టు కార్మికుల మస్టర్ అడ్డా వద్ద, ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర రెండో మహాసభకు ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ ఆవిష్కరణలో వారు మాట్లాడుతూ, ఈనెల 31న ఎల్లన్న భవనం ఇల్లందులో జరుగు సింగరేణి కాంటాక్ట్ కార్మికుల మహాసభకు సింగరేణి కాంటాక్ట్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కాంట్రాక్టు కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ మహాసభలో గత ఏడేళ్లుగా సింగరేణిలో కాంటాక్ట్ కార్మికుల వేతనాలు పెరుగుదల లేక కార్మికుల కుటుంబాలు ఇబ్బంది పడుతున్న సమస్యల మీద, 2021 నుండి కార్మికుల జీతం నుండి కట్ చేసిన సీఎం పీఎఫ్ లెక్కలు చూపకపోవడం వలన, కార్మికులు డ్యూటీకి రాకపోతే పెనాల్టీలు వేస్తున్న దానిపై చర్చించి, పోరాట రూపాల ప్రణాళికలను ఎంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి చేసేందుకు కార్మికులు మహాసభకు తరలిరావాలని కోరారు. శివయ్య, సూర్య, నాగమణి, జ్యోతి,బాలు,ఉప్పలయ్యా,సలీం,ప్రసాద్,ఎర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



## అండర్ 17 బాలుర క్రికెట్ జట్టుకు ఎంపికైన పెనుబల్లి మండల క్రీడాకారులు

**పెనుబల్లి, జనవరి 25 (జనంసాక్షి)**
అండర్ 17 బాలుర క్రికెట్ జట్టుకు పెనుబల్లి మండల విద్యార్థులు ఎంపికైనారు,శనివారం ఖమ్మం లో జరిగిన అండర్ 17 బాలుర క్రికెట్ జిల్లా జట్టుకు ఎంపికైన వారిలో పెనుబల్లి మండలం వి.ఎం బంజర్ కు చెందిన ఎం ఎస్ ఎస్ చందు ( రెజోనెన్స్ కాలేజ్) ,పి రామ్ చరణ్ సాయి(అరుణోదయ స్కూల్), ఎస్.కె ముజాహిద్ (రమేష్ స్కై స్కూల్), పి లక్ష్మి వెంకట్ కుమార్ (టి జి మోడల్ స్కూల్), ఎం మౌనిష్ (గౌట్ కాలేజ్ ) విద్యార్థులుఉన్నారు, వీరు హైదరాబాద్ లోటి డి సి ఎ అండర్ -17 జట్టుకు వీరు ఎంపికైనారు, వీరు రేపు హైదరాబాద్ లొ జరిగే మ్యాచ్ లో పాల్గొంటారని సీనియర్ ప్లేయర్, మారుతి షెడ్ ఉప్పు శెట్టి శ్రీనివాసరావు తెలిపారు.



## విద్యార్థినీ,విద్యార్థులకు క్షయ వ్యాధిపై అవగాహన

**టేకులపల్లి, జనవరి 25( జనం సాక్షి):**
సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఈ సంవత్సరాంతానికి భారతదేశంలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించ డానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వా మ్యంలో నిర్వహిస్తున్న 100 రోజుల ముమ్మర కృషి కార్యక్రమం లినిక్షయ్ షివిర్లి లో భాగంగా శనివారం టేకులపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ, మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే హాస్టల్స్ విద్యార్థిని,విద్యార్థులకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. భారతదేశంలో క్షయ వ్యాధి తీవ్రత వ్యాధి లక్షణాలు వ్యాపించే విధానం ప్రభుత్వం అందిస్తున్న ఉచిత నాణ్యమైన నిర్ధారణ పరీక్షలు ఖరీదైన ఉచిత చికిత్స వ్యాధి తగ్గేంతవరకు నిపుణుల పర్యవేక్షణ సూచనలు, సలహాలు ఆర్థిక సహాయం తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ సులోచన రాణి,కేజీబీవీ ప్రిన్సిపల్ సంతు,మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే ప్రిన్సిపల్ రవీందర్, వార్డెన్లు వెంకటేశ్వరరావు,కళ్యాణి, ఇల్లందు డివిజన్ క్షయ నివారణాధికారి శంకర్, సూపర్వైజర్ నాగుబండి వెంకటేశ్వర్లు, స్టాఫ్ నర్సులు సరిత, రేష్మ, సీతాదేవి శైలజ, ఏఎన్ఎం సులోచన, ఆశా కార్యకర్తలు మజహరి,లక్ష్మి, పద్మ,అరుణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ తల్లిదండ్రులకు సన్మానం- పాదాభివందనం

**వినూత్న రీతిలో పిటీఎం సమావేశం**

**టేకులపల్లి,జనవరి 25 (జనంసాక్షి):**
సమాజంలో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం, ఎం.జ్యోతిరాణి సూచించారు. టేకులపల్లి మండలం బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక(పీటీఎం) సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం రూపొందించిన ఎజెండా ప్రకారం గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి, పిల్లలకు ఆహార భద్రత ద్వారా మంచి ఆహారం అందించాల్సి న ఆవశ్యకతను గురించి, వారి ఎదుగుదల చర్యలు గురించి వివరించారు.విద్యార్థులు రూపొందించిన బోధనో ఉపకరణాలతో ప్రదర్శన నిర్వహించారు. ఉత్తమ తల్లిదండ్రులకు సన్మానాలు చేసి, విద్యార్థులతో పాదాభివందనం చేయించి మాతృ దేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ ఆవశ్యకతను తెలియజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను ఆశీర్వదించారు. ఉత్తమ తల్లులకు కిరీట ధారణ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పొగాకు లక్ష్మి,బొమ్మనపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్.ఎం. మంగీ లాల్ అతిథులుగా పాల్గొని ఉత్తమ తల్లిదండ్రులకు బహుమతులు అందజేశారు. టీచర్లు జర్పుల పద్మ, ఐ ఆర్ పి టీచర్ నీరజ షారోన్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు డ్వాక్రా మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





# కేంద్ర ప్రభుత్వ విద్యుత్ బస్సుల పథకంలో సవరణలు చేయాలి

◆ఖమ్మంలో బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన ఆర్టీసి కార్మికులు

◆ప్రజల అవసరాల మేరకు బస్సుల సంఖ్యను పెంచాలి

◆ఎం వి యాక్ట్ 2019 లో సవరణలు చేయాలి

◆ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు హనుమంతరావు,వెంకటేశ్వర్లు డిమాండ్



**ఖమ్మం, (జనంసాక్షి) :**
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ బస్సుల పథకంలో ఆర్టీసీలకు అనుకూలమైన సవరణలు చేయాలంటూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా ఖమ్మం డిపోలో రెండో రోజు ఆర్టీసీ ఉద్యోగులు,కార్మికులు బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. శనివారం ఉదయం మొదటి షిఫ్టు నుండే స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(సిఐటియు అనుబంధం),స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్ టియుసి అనుబంధం) సంఘాల ఆధ్వర్యంలో డిమాండ్ బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఖమ్మం డిపో వద్ద జరిగిన కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు(సిఐటియు) మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యుత్ బస్సుల పథకం నేరుగా ఆర్టీసీలే విద్యుత్తు బస్సులను కొని నడిపే విధంగా సవరణలు చేయాలని,అందుకు ప్రభుత్వం కూడా ఆర్టీసీలకు అవసరమైన నిధులు సమకూర్చాలని, ఆ పథకంలో భాగంగా ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్న సబ్సిడీలు, ఇన్సెంటివులు ఆర్టీసీలకు చెందే విధంగా సవరణలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్(ఐఎన్ టియుసి) రాష్ట్ర కార్యదర్శి బత్తుల హనుమంతరావు ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వ విద్యుత్ బస్సుల పథకం నేరుగా ఆర్టీసీలకు లాభం,తద్వారా ప్రజలకు ప్రయోజనం కలిగేలా ఉండాలన్నారు.తెలంగాణ ఆర్టీసీకి అనేక రకాల బస్సులను ప్రవేశపెట్టి సమర్థవంతంగా నడిపిన చరిత్ర ఉందని అందుకని విద్యుత్తు బస్సుల కొనుగోలు మరియు నిర్వహణ కూడా సంస్థ చేసేందుకు గాను కేంద్ర ప్రభుత్వ విద్యుత్ బస్సుల పథకంలో వెంటనే సవరణలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఖమ్మం రీజియన్ కార్యదర్శి పిట్టల సుధాకర్ మాట్లాడుతూ ప్రజల అవసరాల మేరకు ఆర్టీసి బస్సులను పెంచాలని,హరితహారం,నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం క్రింద నిధులు ఆర్టీసికి ఇవ్వాలని,మోటార్ వాహన చట్టం(ఎం.వి.యాక్ట్) 2019 లో సవరణ చేయాలని ఆర్టీసీలకు,కార్మికులకు ప్రజలకు నష్టం కలిగించే విధంగా ఉన్న విద్యుత్ బస్సుల పథకంలో కేంద్ర ప్రభుత్వం సవరణలు చేసేంతవరకూ కార్మికులు ఐక్యంగా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షేక్ సైదులు, బి.భాస్కర్, నరసింహాచారి, పుష్ప, ఉమారాణి, సత్యావతి,కల్పన,పద్మ,భాగ్యలక్ష్మి,రంగా శ్రీను,కృష్ణయ్య,శంకర్, బుగ్గవీటి లింగమూర్తి, వై.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

**బూర్గంపహాడ్ జనవరి 25 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల ఆర్ ఐ నరసింహారావు 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. శనివారం సోంపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేయాలని ఆయన తెలిపారు. ఓటు హక్కు కొరకు మండల రెవెన్యూ కార్యాలయం, బిఎల్ఓ లకు దరఖాస్తులను అందించాలని తెలిపారు. అంతేకాకుండా మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రకటించి ప్రశంస పత్రాలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందు, ఉపాధ్యాయులు శారద, లక్ష్మి, దేవి గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటేష్, అంగనవాడి టీచర్ గోపోజి దేవమణి, గ్రామ పెద్దలు బొరెం సంపత్ కుమార్, పెంకె నాగేంద్రబాబు, నస్కూరి క్రాంతి కుమార్, పండగ రాములు, పండగ ఉదయ్ కిరణ్, పెంకే దారుగా, ఆశా వర్కర్ పండగ చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.



## మానవత్వం చాటుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు

**తమకు అర్హత ఉన్న తమకు వద్దని తమకు కేటాయించిన రెండు ఇళ్లు నిరుపేదల కేటాయించాలని వినతి పత్రం**

**చింతకాని, జనవరి 25 (జనంసాక్షి)**
మండల పరిధిలోని పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. శనివారం తమకు అర్హత ఉన్న తమకు వద్దని తమకు కేటాయించిన రెండిళ్ళు నిరుపేదల కేటాయించాలని దాతృత చాటుకున్నారు. గ్రామానికి చెందిన మధిర శ్రీనివాస్ రెడ్డి ఇనుకుళ్ళ సుధాకర్ రెడ్డి లకు గత రెండు రోజుల క్రితం ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యాయి. గ్రామంలో అర్హత ఉండి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కానీ నిరుపేదలకు ఇవ్వాలని లిఖిత పూర్వకంగా పంచాయతీ కార్యదర్శి కి వినతి సమర్పించారు. గ్రామంలో ఇల్లు మంజూరైన తమకు వద్దని నిరుపేదలకు కేటాయించాలని కోరిన శ్రీనివాసరెడ్డి, సుధాకర్ రెడ్డిని గ్రామ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇనుకుళ్ళ నాగ సురారెడ్డి, అలవాల జనార్ధన్ అలవాలవెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాసాని ఐలయ్య మరణం సిపిఎం పార్టీకి తీరని లోటు.,

**బూర్గంపహాడ్ జనవరి 25 (జనంసాక్షి)**



కాసాని ఐలయ్య మరణం సిపిఎం పార్టీకి తీరని లోటని బూర్గంపహాడ్ మండలం సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. సి పి ఎం మండల కమిటీ ఆయనకు పూలమాల ఏసి ఘనంగా విప్లవ జోహార్లు జోహార్లు అర్పించారు.ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పాపినేని సరోజన, భయ్యా రాము, అబిదా, పార్టీ సభ్యులు హుస్సేను, కౌలూరి నాగమణి, మీనా, అన్నపూర్ణ, శివ, రావులపల్లి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



## రంగశాయిరెడ్డి మృతి బాధాకరం

**తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**

**నిడమనూరు జనంసాక్షి**
నిడమనూరు మండలం మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు యడవల్లి రంగశాయిరెడ్డి అకాల మరణం బాధాకరమని తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. యడవల్లి రంగశాయిరెడ్డి అనారోగ్యంతో బుదవారం మృతి చెందిన విషయం తెలుసుకున్న గుత్తా సుఖేందర్ రెడ్డి శనివారం నిడమనూరు మండలం తుమ్మడం గ్రామంలోని ఆయన నివాసం లో చిత్ర పటానికి పూల మాల వేసి నివాళ్ళు అర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాంత అభివృద్ధికి కొరకు ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి , ఆప్కాబ్ మాజీ ఛైర్మన్ యడవల్లి విజేందర్ రెడ్డి , యడవెల్లి విక్రమ్ రెడ్డి, యడవల్లి వల్లభ్ రెడ్డి, నిడమనూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంకతి సత్యం, ముంగి శివ మారయ్య,కొండ శ్రీనివాస్ రెడ్డి, యడవల్లి నరేందర్ రెడ్డి, మేరెడ్డి చెన్న కృష్ణారెడ్డి, మంజుల సీతారాములు తదితరులు పాల్గొన్నారు .



## చింతకాని మండల కేంద్రంలో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు

**18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి పౌరుడు ఓటు హక్కును పొందాలి**

**తహసీల్దార్ కూరపాటి అనంతరాజు**

**ఓటు హక్కును పొందండి మీ ప్రజాప్రతినిధులను మీరే ఎన్నుకోండి**

**మండల పరిషత్ అభివృద్ధి అధికారి రేబల్లి రామయ్య**

**చింతకాని, జనవరి 25 (జనంసాక్షి)**
చింతకాని మండల కేంద్రంలో 15వ జాతీయా ఓటరు దినోత్సవం సందర్భంగా చింతకాని తహసీల్దార్, ఎంపీడీఓ, మండల అధికారుల, సిబ్బంది మండల తాసీల్దార్ కార్యాలయం నుండి మండల కేంద్రం ప్రదాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కూరపాటి అనంతరాజు ప్రతిజ్ఞ చేయించి మాట్లాడుతూ18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి పౌరుడు ఓటు హక్కునుపొందాలని, ఓటు హక్కే భావి తరాల భవిష్యత్తుకు పునాదని, ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే అర్హులైన వారందరూ ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే సాధ్యవవుతుందని అన్నారు.మండల పరిషత్ అభివృద్ధి అధికారి రేబల్లి రామయ్య మాట్లాడుతూ ఓటు హక్కును పొందండి మీ ప్రజాప్రతినిధులను మీరే ఎన్నుకోండి. ప్రతి పౌరుడికి ఓటు హక్కు జన్మహక్కని, ఓటు హక్కు, ప్రజాస్వామ్య వ్యవస్థ పై విద్యార్థులకు ప్రజలకుకు అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు.ఈ కారక్రమంలో తాసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు, మండల పరిషత్ ఉద్యోగులు, పోలీస్ సిబ్బంది మండల ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడికి సన్మానం



**దేవరకొండ, జనవరి 25 (జనంసాక్షి)**
కొండమల్లేపల్లి మండల ఎమ్మార్పీఎస్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన ఎదుల ఎల్లయ్య మాదిగ మాదిగ జాతికి ఆత్మగౌరవం గుర్తింపు తేవాలని కొండమల్లేపల్లి పిఎసిఎస్ చైర్మన్ డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి నూతన అధ్యక్షులు కి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో చింతకుంట్ల మాజీ సర్పంచ్ శ్రీను, ఎమ్మార్పీఎస్ నాయకులు పంది సాయిలు, ఎదుల కిరణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు మోయిన్ పాషా, కొర్ర యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



## ఏకగ్రీవంగా ఆర్ అండ్ బి మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నికలు

**నల్లగొండ టౌన్,జనవరి 25,జనంసాక్షి**

రోడ్డు భవనాల శాఖ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నికలను శనివారం రోడ్డు భవనాల శాఖ జిల్లా కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఇమ్మిడి శెట్టి ఉదయ్ కుమార్,
కార్యవర్గం సెక్రటరీగా మహమ్మద్ఇలియాజ్,అసోసియేట్ ప్రెసిడెంట్ గా నెదునూరి మహేష్,వైస్ ప్రెసిడెంట్ గా పణి రాజశేఖర్,జిల్లా ట్రెజర్ గా అశోక్,వైస్ ప్రెసిడెంట్ గా సతీష్ ప్రసాద్,మహిళా కార్యదర్శిగా మనీ,ఈ సి నెంబర్లుగా కవిత, మెమరీ, మౌనిక గార్లను ఏకగ్రీవంగా అనుకున్నారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టీఎన్జీవోస్ అధ్యక్ష,కార్యదర్శిలు నాగిళ్ల మురళి,ప్రధాన కార్యదర్శి శేఖర్ రెడ్డి లు పాల్గొని ఉద్యోగుల సమస్యలపై పలు సూచనలు చేశారు.ఉద్యోగుల సమస్యల పై నిరంతరం యూనియన్ పనిచేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి,తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్,టిజిఓస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కి ఎండి మహబూబ్,ఎండి జాకీర్ లు నూతన నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కష్టజీవులకు అండా కమ్యూనిస్టు జెండా

### సిపిఎం నేత వెంకటేశ్వర్లు



వేములపల్లి జనవరి 25 (జనంసాక్షి):
కార్మికులు కర్షకులు కష్టజీవుల హక్కుల సాధనకు అండగా కమ్యూనిస్టు జండా నీడలో అలుపెరుగని పోరాటాలునిర్వహించనున్నట్లుసిపిఎంజిల్లాకార్యదర్శి వర్గ సభ్యుడువేరేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ఈనెల 25 26 27 28 నాలుగు రోజుల పాటు సంగారెడ్డిలో జరిగే సిపిఎం పార్టీ 4వ రాష్ట్రమహాసభలనుపురస్కరించుకొని శనివారంవేములపల్లిమండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సిపిఎం పార్టీ ఎన్నో ప్రజా పోరాటాలు నిర్వహించి ప్రజా సంక్షేమానికి పేద ప్రజల సంక్షేమానికి అనునిత్యం పాలకవర్గాలపై పోరాడుతుందన్నారు.సిపిఎం పార్టి 4వరాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని, ప్రస్తుతం పాలకవర్గం ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలని అమలు చేయాలని పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని పేదలకు ఇళ్ల స్థలాలు ఇండ్లు కట్టించాలని రేషన్ కార్డులు పెన్షన్లు అలాగే రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బందులుపడుతున్నారు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సిపిఎం పార్టీ అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలోసిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రొండి శ్రీనివాస్ మాజీ వైస్ ఎంపీపీ పాదురు గోవర్ధన మండల కమిటీ సభ్యులు కోడిరెక్క వెంకన్న చల్లబట్ల ప్రణీత్ రెడ్డి పుట్టల సైదులు అనిరెడ్డి శ్రీనివాసరెడ్డి వడ్డగాని సైదులు ఐద్వా మండల కార్యదర్శి అనిరెడ్డి మాధవి సిపిఎం నాయకులుతదితరులు పాల్గొన్నారు.

## చదువుతోనే బంగారు భవిష్యత్తు మండల విద్యాశాఖ అధికారి ఆర్.నాగేశ్వరరావు

**కొండమల్లేపల్లి, జనవరి 25 జనంసాక్షి :**
విద్యార్థులు భవిష్యత్తులో స్థిరపడటానికి విద్య ఎంతో అవసరమని బాగా చదువుకునే విద్యార్థులకే మంచి భవిష్యత్తు ఉంటుందని మండల విద్యాశాఖ అధికారి ఆర్ నాగేశ్వరరావు నాయక్ అన్నారు.శనివారం మండల కేంద్రంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో కల్చరల్ ఉత్సవ్ 2025 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కృతి, సంస్కారాలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల బోధనకు పెద్దపీట వేస్తూ రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు పొందే విధంగా బోధన ఉండాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ కట్ట వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన బోధనే మా పాఠశాల ముఖ్య లక్ష్యం అని గ్రామీణ మారుమూల ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులతో పాటు పట్టణ విద్యార్థులపై కూడా ప్రత్యేక శ్రద్ధ అవగాహనతో కూడిన విద్యాబోధన ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు పాఠశాల బోధనతో పాటు సామాజిక వ్యవహారాలపై మంచి అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక



కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ దామోదర్ రెడ్డి, ప్రసాద్, శ్రీనివాస్, రాజు, శ్రీను, అలీ, వెంకట్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యా యినీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

## ఆట వస్తువుల అందజేత..

**చిట్యాల జనవరి 25(జనంసాక్షి)**
చిట్యాల మండలము తాళ్ల వెల్లంల గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో చిట్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పదివేల రూపాయల విలువ చేసే ఆట వస్తువులు సామాగ్రినీ అందజేయడం జరిగింది. స్పోర్ట్స్ కిట్టును తన సొంత నిధులతో డిస్టిక్ చైర్ పర్సన్ యూత్ ఎంపవర్మెంట్ అండ్ ట్రైనింగ్స్ మదన్మోహన్ అందించడం జరిగింది అనంతరం మాట్లాడుతూ స్పోర్ట్స్ కిట్టు విద్యార్థులు ఉపయోగించుకొని శారీరకంగా మానసికంగా అన్ని రంగాలలో ముందు ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ఎంజీఎఫ్ ఆమంచి రాజలింగం, జోన్ చైర్పర్సన్ చిలుకూరి రామకృష్ణ,జిల్లా కోఆర్డినేటర్ కోడె సతీష్ కుమార్, డిస్టిక్ చైర్పర్సన్ గట్టు అశోక్ రెడ్డి,చిట్యాల లైయన్స్ క్లబ్ అధ్యక్షులు జనగాం రవీందర్ గౌడ్,కోశాధికారి కొల్లోజు శ్రీకాంత్,జాయింట్ కార్యదర్శి పంతంగి కరుణాకర్ గౌడ్,పొన్నం లక్ష్మయ్య గౌడ్,కంభంపాటి సతీష్,మునుగోటి స్వామి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంబయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నక్క స్వప్న ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



## సల్కునూరుసహకారసంఘం చైర్మన్ గడ్డం స్ఫురధర్ రెడ్డి ఔదార్యం

**అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు రూ. 10వేలు ఆర్థిక సహాయం**

**వేములపల్లి జనవరి 25 (జనంసాక్షి) :**
మండలం లోని సల్కునూరు గ్రామంలో అట్టడుగు ప్రజల ఆశాజ్యోతి భారతరాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు సల్కునూరుప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గడ్డం స్ఫురధర్ రెడ్డి
శనివారం రూ.10 వేల నగదు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా దళితులు, గ్రామ ప్రజలు గడ్డం స్ఫురధర్ రెడ్డి ఔదార్యాన్ని అభిందించి ప్రత్యేకకృతజ్ఞతలు తెలిపారు . అనంతరం ఆయన మాట్లాడారు. స్వేచ్ఛ సమానత్వపు హక్కులను కల్పించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంకోసం ముందుకు రావడంఅభినందనీయన్నారు.ఈ కార్యక్రమంలో సల్కునూరు మాజీ సర్పంచ్ అంకెపాక రాజు, సహకార సంఘం కార్యదర్శి వాకిటి నరేష్, డైరెక్టర్ పళ్ళ బిక్షం, రాచమల్ల నరసయ్య, రాచమల్ల లింగయ్య, దాసరి చంద్రయ్య, అంకెపాక గిరి, నరేష్, బచ్చలకూరి శోభన్ బాబు,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల కోసమే గ్రామ సభలు తప్ప, ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు

### బి.ఆర్.ఎస్ మండల అధ్యక్షులు నాగులవంచ తిరుపతిరావు



**గుర్రంపోడు జనవరి 25(జనంసాక్షి)**
ముందస్తు సర్పంచ్,జడ్పిటిసి, ఎంపీటీసీ ఎలక్షన్ల కోసం వారు గ్రామ సభలు పెట్టడం జరిగి%శీ%ది, కాంగ్రెస్ పార్టీ వారు మబ్యపెట్టే మాయ మాటలు తప్ప ఏ ఒక్క హామీను కూడా నెరవేర్చలేదు, మళ్లీ ఓట్ల కోసం వస్తుంద్రు, ఇప్పుడు పడుతున్న ప్రజల అవస్థలు మళ్లీ మీరు మోసపోవద్దు కేవలం ఓట్ల కోసమే తప్ప ఆరు గ్యారంటీలు అమలు చేయలేదు, ఇక మీ జూటా మాటలు విని ప్రజలు మోసపోరు వచ్చే స్థానిక ఎలక్షన్లలో ప్రజలు మీకు తగిన బుద్ధి చెబుతారు, మళ్లీ ఓట్లు ఎలా వేస్తారు అనుకుంటున్నారు, కేవలం ఓట్ల కోసమే మీ డ్రామాలు తప్ప ప్రజలకి ఎక్కడ న్యాయం జరగలేదు, దమ్ముంటే ఆరు గ్యారంటీలు అమలు చెయ్, ప్రజల ఉసురు మీకు తప్పకుండా తగులుతుంది.అని తెలిపారు. ఈ. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు మేకల వెంకట్ రెడ్డి,కేసాని వెంకటరెడ్డి,కామల్ల రాములు,పిఎసిఎస్ వైస్ చైర్మన్ పామనగుండ్ల వెంకన్న,షేక్ సిరాజు, ఆవుల కృష్ణ, చంటి,శ్రీనివాసాచారి,జాల మల్లయ్య,మేడి లింగయ్య, రవీందర్ రెడ్డి,దోటి గణేష్, కుందారపు యాదగిరి, కూర బాలరాజు,దండు యాదయ్య, చిరంజీవి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తటూర్ ఎమ్మార్పీఎస్ గ్రామ నూతన కమిటీ నియామకం

### అధ్యక్ష కార్యదర్శులుగా మేడి రాజు, మేడి విగ్నేష్



**రామన్నపేట, జనవరి 25 (జనంసాక్షి):** ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ, జిల్లా కమిటీ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని ఉత్తటూరు గ్రామంలో మండల సలహాదారులు కోళ్ల కిషన్, మేడి నర్సింహా అధ్యక్షతన జిల్లా సినియర్ నాయకులు ఈర్లపల్లి మల్లయ్య, మండల ఇంచార్జి నల్ల స్వామి,అధ్యక్షులు నోముల చిరంజివి ఆధ్వర్యంలో నూతన ఉత్తటూరు ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షులుగా మేడి రాజు , ప్రధాన కార్యదర్శిగా మేడి విగ్నేష్ , ఉపాధ్యక్షులుగా మేడి గణేష్ , కొత్త సిద్దార్ద సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు నోముల చిరంజివి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా ఫిబ్రవరి 7న హైదరాబాదులో నిర్వహించే లక్ష డప్పులు వేల గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఎమ్మార్పీఎస్ బలోపేతమే లక్ష్యంగా గ్రామ గ్రామాన నూతన కమిటీలను ప్రకటిస్తున్నట్లు తెలిపారు. నూతన కమిటీకి గ్రామస్తులు ఎమ్మార్పీఎస్ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సినియర్ నాయకులు మా, కందాల దేవేందర్,సాయిరాం, సిద్ధు, రోహిత్, అజయ్, నితిన్, ఉపేందర్, శివ, అనిల్, మత్స్యగిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా స్ఫూర్తితో లక్ష్యాన్ని చేరాలి

### ఎస్ఐ పి. మల్లయ్య



**రామన్నపేట, జనవరి 25 (జనంసాక్షి):** క్రీడా స్ఫూర్తితో లక్ష్యాన్ని చేరాలని రామన్నపేట ఎస్సై పి.మల్లయ్య అన్నారు. మండలంలోని ఇంద్రపాలనగరం జడ్పీ హైస్కూల్ ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా శనివారం పూస బాలకిషన్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ను స్థానిక ఎస్ఐ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పూస బాలమణి నరసయ్య,పూస బాలకిషన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్దగోని వెంకటేశం, మల్లం మల్లయ్య, రుద్రాల విక్కి, కంబాలపల్లి నరేష్, పబ్బు మచ్చిందర్, కేస సాయి, కేస సందీప్ తదితరులు పాల్గొన్నారు.




# మందుగుల యాదయ్య సేవలు మరువలేనివి

**చిట్యాల జనవరి 24 (జనంసాక్షి)** సిపిఎం నాయకులు, ప్రజానాట్యమండలి కళాకారుడు కా మందుగుల యాదయ్య సేవలు మరువలేనివని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు.చిట్యాల మండలం నేరడ గ్రామంలో శనివారం నాడు జరిగిన కా, మందుగుల యాదయ్య సంతాప సభకు ఆయన హాజరై మాట్లాడారు.సిపియం గ్రామ శాఖ కార్యదర్శిగా, ఇండ్ల స్థలాలు పోరాటం తో పాటు అనేక ఆందోళన కార్యక్రమాలు చేసిన యాదయ్య మృతి మండల పార్టీకి, ప్రజా నాట్య మండలికి తీరని లోటని అన్నారు.సిపియం మండల కమిటీ సభ్యులు కల్లూరి కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, చింతపల్లి బయన్న, మండల నాయకులు అరూరి శ్రీను, కందగట్ల గణేష్,నెలికంటి నర్సింహా, ఐతరాజు నర్సింహా, పంది నరేష్,జిట్ట స్వామి,ఐతరాజు యాదయ్య, వివిధ ప్రజా సంఘాల నాయకులు నర్సింహా చారి, వడ్డేపల్లి ఎల్లయ్య, కల్లూరి లక్ష్మయ్య, మహేష్, కిరణ్, కిశోర్, శంకర్,యాదయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక ప్రదేశాలను కాపాడుకోవాలి

### ఆలంపల్లి నరసింహ మున్సిపల్ చైర్మన్

### వై.సుదర్శన్ మున్సిపల్ కమిషనర్



**దేవరకొండ జనవరి 25 (జనంసాక్షి)** దేవరకొండ పట్టణంలో శనివారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని గాంధీ చౌరస్తా నుండి ఖిల్లా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, కమిషనర్ లు మాట్లాడుతూ దేశంలో ఉన్న అందమైన ప్రదేశాలను చూసి ఆస్వాదించాలని ప్రోత్సహించడమే పర్యాటక దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం అని అంటారు. అందమైన కట్టడాలను చూసి వాటి చరిత్రలు మన ముందు తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. పర్యాటక ప్రదేశాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎస్ రమణారెడ్డి, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ రాము చౌహన్, వనం చంద్రమౌళి, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వస్కుల సత్యనారాయణ, స్థానిక కౌన్సిలర్లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలు నివారిద్దాం

### డిఎస్పీ సతీష్‌కుమార్

**పాల్వంచ, జనవరి 25 (జనంసాక్షి) :** ట్రాఫిక్ రూల్స్ పాటించి రోడ్డు ప్రమాదాలు నివారిద్దామని స్థానిక డిఎస్పీ సతీష్ కుమార్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియమ నిభంధనలు, చేయవలసినవి, చేయకూడనివి, డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల భీమా, దాని ప్రయోజనాల గురించి. భీమా యోజన, భీమా పాలసీల గురించి తెలియజేశారు. ప్రమాదాల నివారణ మనందరి బాధ్యత అని ప్రతీ ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ తమ తమ గమ్య స్థానాలకు చేరుకోవాలని పేర్కొన్నారుఆటోలు, టాక్సీలు, టాటా మ్యాజిక్ డ్రైవర్‌లు దాదాపు 200ల మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, సిఐ సతీష్, టౌన్ ఎస్ఐ సుమన్, ఫారుఖ్ తదితరులు పాల్గొన్నారు.




# జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవ అవగాహనా సదస్సు

- డోన్ బొస్కో హైస్కూల్ లో కార్యక్రమం ఏర్పాటు
- ముఖ్య అతిథులు గా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఆనంద్ శ్యామ్ ప్రసాద్
- హాజరైన మండల విద్యాధికారులు జ్యోతి, శ్రీనివాస్ రెడ్డి
- నిర్వహించిన స్కూల్ కరస్పాండెంట్ పిజివి చిట్టిబాబు

**రామన్నపేట, జనవరి 25 (జనంసాక్షి):** వాహనదారులు రోడ్డుపై ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని భువనగిరి జిల్లా మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఆనంద్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మండలకేంద్రంలోని డోన్ బోస్కో హైస్కూల్ కరస్పాండెంట్ పిజీవి చిట్టిబాబు అధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఆనంద్ శ్యామ్ ప్రసాద్, రామన్నపేట మండల విద్యాధికారి జ్యోతి మరియు డిప్యూటీ ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి లు హాజరయ్యారు. నెల రోజులుగా నిర్వహిస్తున్న భద్రత వారోత్సవాలలో భాగంగా శనివారం రామన్నపేట కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రోడ్డు దాటేటప్పుడు, వాహనాలు ఎక్కి దిగేటప్పుడు, రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్లేటప్పుడు, సైకిల్ పై వెళ్లేటప్పుడు, కుటుంబ సభ్యులతో పాటు ప్రయాణం చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు.ఈ వారోత్సవాలు నెల రోజులు పాటు కొనసాగుతాయని ఈ కార్యక్రమానికి సామాజిక కార్యకర్తలు సంబంధిత డిపార్ట్మెంట్ వారు పాల్గొని ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే విధంగా తోడ్పాటు చేయాలని కోరారు. కార్యక్రమం అనంతరం మాసోత్సవ వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేసి, విద్యార్థులు ర్యాలీగా సుభాష్ సెంటర్ వరకు వెళ్లి మండల కేంద్రంలోని వాహనదారులకు అవగాహన కల్పించే విధంగా విద్యార్థులు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో రామన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు, సబ్ ఇన్స్పెక్టర్ పి.మల్లయ్య మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ పిఎన్ జనార్ధన రావు, ఇంచార్జిలు హీన, విజయలక్ష్మి, ఎస్డి ఖధీర్, పిఈటి శ్రీకాంత్, బోధన, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వపథకాలలఅమలులో నిజమైన లబ్ధిదారులకుమొండి చేయి

### సిపిఎంమండల కార్యదర్శి పాదూరి శశిధర్ రెడ్డి

**వేములపల్లి జనవరి 25 (జనంసాక్షి):** ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందించడంలో ప్రభుత్వాలు విఫలం, నిజమైన లబ్ధిదారులకు మొండి చెయ్యి మాత్రమే మిగులుతుందని సిపిఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్ రెడ్డి ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం వచ్చినా అధికార యంత్రాంగం ప్రభుత్వా నికి అధికార పార్టీ నాయకులు చెప్పిన అనుమాయులకేఅనుకూలంగా వ్యవహారిస్తూ కనీస ధర్మం పాటించకపోవడంతో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందన్నారు. దీనికి నిదర్శనం ప్రస్తుతంమూడు రోజుల పాటు గ్రామసభలు అన్నారు. లబ్ధిదారులఎంపికతో అధికారులు గ్రామసభలతో తమపని అయిపోయిందని ఊపిరి పీల్చుకుంటున్నారు అధికార పార్టీ వారేమో మేము అనుకున్న పంతం నెగ్గిందని సంబరపడుతున్నారు కానీ గ్రామాల్లో దరఖాస్తు చేసుకున్న వారిలో నిజమైన లబ్ధిదారులు ఎంపిక చేయడంలో అన్యాయం జరిగిందని ప్రజలు గ్రామాలలో అసంతృప్తితో రగిరిపోతున్నారన్నారు.తిరిగి ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు ఎంపికనుపరిశీలించి నిజమైన లబ్ధిదారులని ఎంపిక చేయాలని అయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు వడ్డాగాని సైదులు నాయకులు మల్లేష్ రాము నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



# నిజాయితీ గల నాయకత్వాన్ని గెలిపిద్దాం

● మన బతుకులు మార్చుకుందాం ● బిఎంఎస్ అధ్యక్ష బిజ్జం అశోక్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వై వెంకటేశ్వరరావు



**బూర్గంపహాడ్ జనవరి 25 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక ఐటిసి మజ్దూర్ సంగ్ (బి ఎం ఎస్) జనరల్ బాడీ సమావేశంలో ఆ సంఘ అధ్యక్షులు బిజ్జం అశోక్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వై వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ నిజాయితీ గల నాయకత్వాన్ని గెలిపిద్దామని, మన బతుకులు మార్చుకుందామని అన్నారు. సారపాక బటిసి గేట్ వద్ద శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మన మిల్లు స్థాపించి 45 సంవత్సరాలు గడిచి, 13వ వేతన ఒప్పందాలు పూర్తి చేసుకున్న తరువాత కూడా ఇంకా కార్మికులు సమస్యలు అనుభవిస్తున్నారంటే ఇంత కన్నా దౌర్భాగ్యం మరొకటి ఉండదేమో అని వాపోయారు. యాజమాన్యం వారి గ్రేడులు పెరుగుతూ వారికి అన్ని సౌకర్యాలు వస్తున్నాయని వివరించారు. కాంట్రాక్టర్లు కోట్లు సంపాదిస్తున్నారని, యూనియన్ లీడర్లు కోట్లు సంపాదిస్తూ కాంట్రాక్టులు తీసుకుంటున్నారని గుర్తు చేశారు. కానీ కార్మికులలో లక్షాదికారులు అవ్వడం పక్కన పెడితే, కనీసం సరైన ఇల్లు, పిల్లలకు మంచి చదువులు, ఉన్నతంగా జీవించే పరిస్థితులు, బ్యాంకు లోన్లు పెట్టి అప్పులు చేసుకుంటూ జీవిస్తున్న ఒక సామాన్య సగటు కార్మికునికిగా ఉన్నాయా అని ప్రశ్నించారు. ప్రస్తుతం మిల్లులో ఎన్నికల సమయం కావున పరిస్థితులన్నింటినీ కార్మికులు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. గత 20 నుండి 25 సంవత్సరాలలో కార్మికులను మోసపూరిత హామీలతో మభ్యపెట్టుకుంటూ, వాళ్ళ పబ్బం గడుపుకొని, కార్మికులకు న్యాయంగా వేతన ఒప్పందాలతో రావలసిన అన్ని సౌకర్యాలను యాజమాన్యం వారికే తాకట్టు పెట్టి తద్వారా రిటైర్మెంట్ అయ్యే సమయానికి గౌడౌన్లు, చెక్కల ఫ్యాక్టరీలు, అట్టల ఫ్యాక్టరీలు పెట్టుకొని, వాటిని కాపాడుకోవడానికి వారి వారసులైన వారినే యూనియన్ నాయకులుగా రంగంలోకి దించి ఇంకొక 20 సంవత్సరాలు కార్మికులను అణగదొక్కే ధోరణిని ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నామన్నారు. కంపెనీలో 35 నుండి 40 సంవత్సరాలుగా సర్వీసు చేసి రిటైరైన కార్మికుడు తీసుకుంటున్న పెన్షన్ 3,500లు అయితే, రిటైర్ అయిన కార్మిక నాయకుడికి నెలకు వచ్చేది ఎంతో తెలుస్తా లక్షల రూపాయలు అని, మరి దానిని బట్టి ఇన్నాళ్ళు వీళ్ళు కార్మికుల కోసం ఎంతో కష్టపడ్డారంటే నమ్ముదామా అని ప్రశ్నించారు. రిటైర్ అయిన వారే నాయకులుగా చలామణి అవుతున్నారని విమర్శించారు. బిఎంఎస్ యూనియన్గా మేము ప్రశ్నించాం. .ప్రశిస్తునే ఉంటామని అన్నారు. ఎందుకంటే కార్మికుడు నా వాడు, కార్మిక కుటుంబాన్ని ఇది నా కుటుంబం అనుకునే ఒకే యూనియన్ బిఎంఎస్ మాత్రమే అని గుర్తించాలని అన్నారు. ఈనెల 31న జరగనున్న గుర్తింపు సంఘం యూనియన్ ఎన్నికలలో వేసే ఓటు ద్వారా మీరే చెప్పండని కోరారు. పూర్తి స్థాయిలో డబ్బే ఆధారంగా ఓట్లు కొనుగోలు చేసే యానియన్ల భరతం పడదాం అంటూ పిలుపునిచ్చారు. దీపం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు కలాల్ శ్రీనివాస్ గండ్ల, ప్రధాన కార్యదర్శి తూర్పు రామిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పినపాక భాను కిషోర్, ట్రెజరర్ పోలినిడి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ అక్కెర శ్యామ్ కుమార్, జి నరేష్ కుమార్, పబ్లిసిటి సెక్రటరీ టి వసంతరావు, బిజ్జం సుబ్బారెడ్డి, ఆఫీస్ సెక్రటరీ పి దుర్గాప్రసాద్, జాయింట్ సెక్రటరీ రాయపూడి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శకమ్యూనిస్టు కాసాని ఐలయ్య

**కాసాని ఐలయ్య అంటేనే భరోసా - నివాళ్లు ఆర్పించిన నేతలు**

కారేపల్లి, జనవరి25(జనంసాక్షి) :
ప్రజాసమస్యల పరిష్కారంలో తనదైన ముద్ర వేసిన ఆదర్శ నేత కాసాని ఐలయ్య అని సీపీఐ(ఎం) జిల్లాకమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర లు అన్నారు. కారేపల్లిలోని భాగం రామనర్సయ్య భవన్లో శనివారం కాసాని ఐలయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు ఆర్పించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ ప్రజాసమస్యలపై కాసాని ఐలయ్య-లక్ష్మి దంపతులు చేసిన పోరాటులు స్పూర్తిదాయకమన్నారు. పేదలకు కొండత భరోసా కల్పించిన కాసాని ఐలయ్య భరోసాకు మారుపేరుగా నిలిచారని కొనియాడారు. ఆయన మరణం ప్రజాపోరాటాలకు తీరని నష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన చూపిన మార్గాని అనుసరించి ప్రజాపోరాటాలు నేరపటమే ఐలయ్యకు మనమిచ్చే నివాళ్లు ఆని అన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు వజ్జా రామారావు, తలారి దేవప్రకాశ్, ముండ్ల ఏకాంబరం, రేగళ్ల మంగయ్య, బానోత్ బన్సీలాల్, దాసరి మల్లయ్య, అన్నారపు కృష్ణ, కరకపల్లి రాయమల్లు, పాసిన్ని నాగేశ్వరరావు, ముక్కా సీతారాములు, ఎస్కె.బందేలి తదితరులు పాల్గొన్నారు.

## కారేపల్లిలో ఓటర్స్ డే ర్యాలీ



**కారేపల్లి, జనవరి 25 (జనంసాక్షి) :** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్బంగా కారేపల్లి వివిధ విద్యాలయాల విద్యార్థులు, అధికారులు శనివారం ర్యాలీ నిర్వహించారు. కారేపల్లి బస్టాండ్ సెంటర్లో మానవహారం ఏర్పాటు చేసి ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వేస్తామని ప్రమాణం చేశారు. ఈసందర్బంగా తహసీల్దార్ సంపత్కుమార్, ఎంపీడీవో సురేందర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో 18 ఏండ్లు నిండిన యువకులు ప్రతి ఒక్కరు బాధ్యతగా ఓటు నమోదు చేసుకోని ఓటు హక్కును వినియోగించు కోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో జయరాజు, డీటీ కే.లక్ష్మి, ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్, కేజీబీవీ ఎస్వో ఝున్సీసౌజన్య తదితరులు పాల్గొన్నారు.



## యోగాతో రోగాలను జయించవచ్చు

**కారేపల్లిలో ఉచిత యోగా శిక్షణ ప్రారంభం**

కారేపల్లి, జనవరి25(జనంసాక్షి) :
ఉరుకుల పరుగుల జీవితం ఆరోగ్యం పై తీవ్రప్రభావం చూపుతుందని, ఆప్రభావాన్ని తగ్గించే శక్తి యోగ కు ఉందని ప్రముఖ వైద్యులు డాక్టర్ సామినేని రాఘవులు, ఉపాధ్యాయులు బాలిన వెంకటరెడ్డి, రామంద్ర మిషన్ జిల్లా కోఆర్డినేటర్ టీ.నర్సింహాచారి అన్నారు. శనివారం కారేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈసంధర్బంగా వారు మాట్లాడుతూ యోగ ధ్యానాలతో రోగాలు తీవ్రతను తగ్గించవచ్చాన్నారు. ధ్యానం శరీరంలోని అన్ని రుగ్మతలను పోగొట్టే దివ్య ఔషధమని తెలిపారు. ఉచితంగా యోగ, ధ్యాన తరగతులు నిర్వహిస్తున్న శ్రీరామచంద్ర మిషన్ ను వారు అభినందించారు. ఈకార్యక్రమంలో యోగా శిక్షకులు వరలక్ష్మి, అరుణ, నరేందర్, ఎన్.కరుణాకర్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు కొత్తతండాలో ప్రభుత్వ పథకాల ప్రారంభ వేడుక

కారేపల్లి, జనవరి25(జనంసాక్షి) :
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న అత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, కొత్తరేషన్ కార్డుల పథకాల ప్రారంభ వేడుకను ఆదివారం కారేపల్లి మండలం కొత్తతండాలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జీ.సురేందర్ తెలిపారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చేతుల మీదిగా పథకాలను ప్రారంభించటం జరుగుతుందని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీవో కోరారు.

## దుబ్బాక గ్రామ వాసి గుండాల ప్రసాద్కు వ్యాస కళాక్షేత్రం ఆత్మీయ పురస్కారం



**రామన్నపేట, జనవరి 25 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని దుబ్బాక గ్రామానికి చెందిన యువ కవి గుండాల ప్రసాద్ కు సాయితీ రంగంలో చేస్తున్న కృషికి శివాని ఆర్ట్స్ వ్యాస కళాక్షేత్రం ఆధ్వర్యంలో కంబాల శివలీల ఫౌండషన్ సహకారంతో ఆత్మీయ పురస్కారం అందుకోవడం అభినందనీయమని తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం జిల్లా కన్వీనర్ బొడ్డుపల్లి వెంకటేశం తెలిపారు.ఈ పురస్కారం 27వ తేదీ హైదరాబాద్ త్యాగరాయ గాన సభలో అందించడం జరుగుతుందని యువతను సాహిత్యం వైపు మళ్ళించి గుర్తించేందుకు పురస్కారం అందించినందుకు వ్యాస కళాక్షేత్రం వ్యవస్థాపకులు బాపనపల్లి పరమేశ్వర్,శ్రీ పెర్మల వేదవ్యాస వెంకటేశు కు ధన్యవాదాలు తెలిపారు.

## దేవాలయం వద్ద విస్తరణ పనులు చేపట్టేం

**దుకై పరిశీలన చేసిన ఇంజనీరింగ్ అధికారులు**



**కనగల్. జనవరి 25 (జనంసాక్షి)** ధర్వేశిపురం (పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ పరిసరల చుట్టూ అభివృద్ధి పనులు మెరుగుపరిచి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలనే సంకల్పంతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశానుసారం శనివారం దేవదాయ శాఖ అధికారులు ఆలయం వద్దకు చేరుకొని పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా అధ్యాయం చేశారు. అభివృద్ధి పనులకు మాస్టర్ ప్లాన్ తయారు చేయడంతో పాటు బడ్జెట్ ప్రణాళికలను సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ చీఫ్ స్థ పతి శ్రీ వల్లి నాయరు చీఫ్ ఇంజనీర్ దుర్గాప్రసాద్ అసిస్టెంట్ గణేష్ ఏఈ కిరణ్ ఆలయ చైర్మన్ చీదేటి వెంకటరెడ్డి ఈవో జిల్లా పెల్లి జయరామయ్య మాజీ చైర్మన్ దే ప  కరుణాకర్ రెడ్డి ధర్మకర్త లు నగేష్ గౌడ్ నరేష్ రాజు శంకర్ రెడ్డి దుర్గమ్మ బాబు వెంకన్న సిబ్బంది చంద్ర గౌడ్ ఉపేందర్ రెడ్డి ఆంజనేయులు సిహెచ్ శ్రీకర్ తదితరులు ఉన్నారు.

## 53 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**- 6A కేసు నమోదు**

**- వినియోగదారుల నుండి నేరుగా కొనుగోలు రేషన్ డీలర్**

**పి.ఏ.పల్లి,జనవరి 25 (జనంసాక్షి)** పి.ఏ.పల్లి మండల పరిధిలోని పేదల బియ్యం పక్కదారి పడుతుందన్న సమాచారంతో శనివారం తెల్లవారుజామున పీ.ఏ.పల్లి మండల పరిధిలో 53 క్వింటాళ్ల రేషన్ బియ్యం సివిల్ సప్లై అధికారులకు పట్టుబడ్డాయి.పీ.ఏ.పల్లి మండలం తిరుమలగిరి రేషన్ షాప్ లో 31 క్వింటాలు,ఎర్రగుంట తండా రేషన్ షాపులో 22 క్వింటాళ్లు పట్టుబడినట్లు అధికారులు తెలిపారు. స్టాక్ ఉండాల్సిన బియ్యం కంటే అధికంగా బియ్యం ఉండడంతో పట్టుబడ్డారు.డీలర్లు పంపిణీ చేసే క్రమంలో వినియోగదారుల నుండి నేరుగా కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తుందన్నారు.అక్రమంగా కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని దళారులకు అక్రమంగా విక్రయిస్తున్నట్లు తెలిపారు.ఇద్దరు డీలర్ల పై 6A కేసు నమోదు చేసినట్లు దేవరకొండ పౌర సరఫరాల శాఖ అధికారులు శ్రీనివాస్ గౌడ్,సైదులు తెలిపారు.పట్టుబడ్డ రేషన్ బియ్యాన్ని దుగ్యాల,మల్లాపురం డీలర్లకు అప్పగించారు.



# వధూవరులను ఆశీర్వదించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్





**కల్లూరు జనవరి 25 (జనంసాక్షి):**
కల్లూరు పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ ఇబ్రహీం కుమార్తె ఇస్రాత్ వివాహం ఖమ్మం పట్టణానికి చెందిన మహమ్మద్ వసీం అమిద్ యాసర్ తో కల్లూరు పట్టణంలో శనివారం అంగరంగ వైభవంగా నిఖా వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులతో కలిసి నిఖా కార్యక్రమానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, డాక్టర్ రాధాకృష్ణమూర్తి, బత్తుల భరత్ కుమార్, రామిశెట్టి శ్రీనివాసరావు,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చంద్రరావు, ఏనుగు సత్యంబాబు, భాగం ప్రభాకర్ చౌదరి, కీసర మోహన రెడ్డి,, బొల్లం రామారావు, ఆలకుంట నరసింహారావు, పరిమి భరత్, షేక్ ఉస్మాన్, జిల్లా మైనార్టీ సెల్ నాయకులు షేక్ బాజీ భాయ్, షేక్ ఇస్మాయిల్,, షేక్ ఇబ్రహీం, ఎండి హనీఫ్, కాంతారావు, దామాల రాజు, భూక్య శివకుమార్ మట్టా రామకృష్ణ, బొల్లం శంకర్.రాజబోయిన శ్రీనివాసరావు, శ్రీనాథ్, దుర్గాప్రసాద్.వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ముస్లిం ప్రముఖులు, బంధుమిత్రులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# సాయి ప్రియ గ్రీన్ మోటార్స్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతి

## పర్యావరణం లో కాలుష్య నివారణకు ఎలక్ట్రికల్ వెహికల్స్ మేలు



**కోదాడ,జనంసాక్షి:**
ప్రజలు పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రికల్ వెహికల్స్ ను కొనుగోలు చేయాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అన్నారు.శనివారం కోదాడ పట్టణంలోని ప్రమీల టవర్స్ ఎదురుగా అనంతగిరి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సాయి ప్రియ గ్రీన్ మోటార్స్ షోరూంను ఆమె ప్రారంభించి మాట్లాడారు.ఎలక్ట్రికల్ బైక్స్ కొనుగోలు చేసే వాహనదారుల కోసం ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలను రద్దు చేసింది అన్నారు.ప్రభుత్వం కల్పించిన రాయితీలను ఈవి వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.నాణ్యత కలిగిన ఎలక్ట్రికల్ వెహికల్స్ ను విక్రయించి సాయి ప్రియ గ్రీన్ మోటార్స్ పేరు తెచ్చుకోవాలన్నారు.

# క్షయ నివారణ శిబిరంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**పెన్ పహాడ్, జనవరి 23 (జనంసాక్షి) :**
మండల పరిధిలోని మహమ్మదాపురం గ్రామంలో శనివారం ప్రత్యేక నిక్షయ శివర్ క్యాంప్ (క్షయ నివారణ శిబిరం) నిర్వహించారు ఈశిబిరాన్ని ఎంపీడీవో జే.వెంకటేశ్వరరావు ఏపీఓ రవి సందర్శించి క్యాంపు ను పరిశీలించారు. అనంతరం డాక్టర్ ను క్యాంపు వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు అందించారు. డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ టీబీ వ్యాధి లక్షణాలు, టీబీ వ్యాధి సంక్రమించే విధానం, నివారణ చర్యలను అదేవిధంగా టీబీ వచ్చినవారికి చికిత్స విధానం వారి నుండి ఇతరులకు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి స్థానికులకు వివరించారు.ఈ కార్యక్రమంలో 44 మందికి తెమడ పరీక్షలు నిర్వహించినామని, 77 మందికి ఎక్స్ రే లు తీయడమైనదని తెలిపారు.ఈ ఎక్స్ రే, తెమడ పరీక్ష లో క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆరు నెలలు ఉచితంగా మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెన్ పహాడ్ లో ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమము లో పి హెచ్ ఎన్ ఎల్. శశిరేఖ, ఎం పి హెచ్ ఈ ఓ బూతరాజు శ్రీనివాసులు, టి చంద్రశేఖర్ రాజు, ఎం పి హెచ్ ఎస్ బూతరాజు సైదులు, ఎల్ టీ . లింగాల రాజు, సీనియర్ టీబీ సూపర్వైజర్ ప్రిన్సి, ఎం పి హెచ్ ఎ (యం) వెంకటరమణ, ఎంపీహెచ్ఏ లు జయశ్రీ, నాగలక్ష్మి, ఎస్ టి ఎస్ కిరణ్, డిఇఓ మాధవరెడ్డి , ఆశా కార్యకర్తలు రేణుక ఇందిరా విజయ నాగమ్మ నాగలక్ష్మి గ్రామ కార్యదర్శి లావణ్య గ్రామపంచాయతీ కార్మికులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు...



# ప్రతి పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

## జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ తీస్తున్న అధికారులు

**పెన్ పహాడ్, జనవరి 25 (జనంసాక్షి) :**
అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఇన్చార్జి తహసిల్దార్ లాలు నాయక్ ఎంపీడీవో వెంకటేశ్వర రావు ,ఎస్సై గోపికృష్ణ, ఎంఈఓ నకిరేకంటి రవి, అన్నారు.శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 18 సంవత్సరాలు పైబడిన వారందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అనంతరం ప్రతిజ్ఞ చేశారు. టిజిఎంఎస్ అనాజిపురం ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ కోడి లింగయ్య విద్యార్థులతో కలిసి ప్లే కార్డులతో ర్యాలీ నిర్వహించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు యొక్క ప్రాధాన్యత గురించి గ్రామ ప్రజలకు తెలియజేశారు భారత రాజ్యాంగం ద్వారా కల్పించబడిన ఓటు హక్కును సద్విని యోగం చేసుకోవాలని, ఓటు అనేది మన భవిష్యత్తును మార్చే ఒక వజ్రాయుధమని ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటును వినియోగించుకోవాలని అదే విధంగా 18 సంవత్సరములు నిండిన యువతి యువకులు ఓటును నమోదు చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, రెవిన్యూ సిబ్బంది,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# పాఠశాలకు దాతల సహకారం అభినందనీయం

## 6000 రూపాయలు నగదు అందజేస్తున్న దాత అశోక్ కుమార్



**లిపెన్ పహాడ్, జనవరి 25 (జనం సాక్షి) :**
ప్రభుత్వ పాఠశాలకు దాతల సహకారం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిండిగా నరసయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని దోస పహాడ్ యుపిఎస్ పాఠశాలకు బిజెపి గ్రామ శాఖ అధ్యక్షులు దొంగరి అశోక్ కుమార్ భార్య దొంగరి పద్మ జ్ఞాపకార్థం పాఠశాలకు కుర్చీల కొనుగోలు కొరకు 6వేల రూపాయల నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిండిగ నరసయ్యకు అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు దాతకు పాఠశాల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మామిడి వెంకన్న, రాయి కింది వెంకటేశ్వర్లు, ఏ విజయ కుమారి, వెంకన్న ,విప్లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# కారేపల్లిలో ఆరోగ్యంపై కళాజాతాలు

**కారేపల్లి, జనవరి 25 (జనంసాక్షి) :**
కారేపల్లి మండలంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖా ఆధ్వర్యంలో శనివారం ఆరోగ్యంపై కళాజాతాలు నిర్వహించారు. ఆరెంపుల సతీష్ కళాబృందం ఆట పాటలు, పల్లె సుద్దులు వంటి కళారూపాలతో పల్లె వాసులకు ఆరోగ్య అంశాలను వివరించారు. గర్భిణీలు తీసుకోవల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం, సీజనల్ వ్యాధులు ప్రాణాంతకమైన క్యాన్సర్, హెచ్ఐవీ పై ప్రజలను చైతన్యం చేశారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సూర్యం, ఏఎన్ఎంలు జయమ్మ, కృష్ణవేణి, ఆశా లు భాగ్యలక్ష్మి, అంజమ్మ, పద్మ, కళాకారులు నర్సింహరావు, చందర్రావు, సుబ్బు, గురవయ్య, రమ తదితరులు పాల్గొన్నారు.

# టి ఎన్ టి యు సి మిత్రపక్షాలకి మాల ఎంప్లాయిస్ యూనియన్ మద్దతు



**బూర్గంపహాడ్ జనవరి 25 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక ఐటిసి లో ఈనెల 31న జరగనున్న గుర్తింపు సంఘం యూనియన్ ఎన్నికల లో మాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎంప్లాయిస్ టిఎన్టియుసి మిత్రపక్షాలకు తమ మద్దతు తెలియజేస్తున్నట్లు శనివారం ప్రకటనలో తెలిపారు. సకాలంలో మంచి వేతన ఒప్పందం చేసి సమర్థవంతంగా పనిచేస్తూ మళ్లీ గెలుపు దిశగా వెళుతున్న టిఎన్టియుసి మిత్రపక్షాలకే రాబోయే వేతన ఒప్పందం చేయగల సత్తా ఉందని విశ్వసిస్తూ తమ పూర్తి మద్దతు టి ఎన్ టి యు సి మిత్రపక్షాలకు ఉంటుందని వారు తెలియజేశారు. రాబోయే గుర్తింపు సంఘ ఎన్నికల్లో టి ఎన్ టి యు సి మిత్రపక్షాల ఘన విజయానికి తమ తోడ్పాటు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి అధ్యక్షులు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి,మాల మహానాడు గౌరవ అధ్యక్షులు బల్లెం మధు, అధ్యక్షులు తుమ్మల సంగీతరావు , ప్రధాన కార్యదర్శి పుట్టి శ్రీనివాసరావు, సామేలు, కట్ట ఆదం, బొప్పన ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ ప్రతిజ్ఞ

**కల్లూరు జనవరి 25 (జనం సాక్షి )**



జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం కల్లూరులో ఎన్ఎస్పీ క్రాస్ రోడ్ దగ్గర నుండి తాహాసిల్దార్ కార్యాలయం వరకు అధికారులు విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఆర్డీవో ఎల్ రాజేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారి పైన మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధమని పేర్కొన్నారు.ఓటు విలువ గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎండిఓ డి చంద్రశేఖర్, ఆర్ ఐ ఉమామహేశ్వరరావు, పలు శాఖలకుచెందిన అధికారులు సిబ్బంది, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. అదేవిధంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి డి చంద్రశేఖర్, ఈవో నందిశెట్టి నాగేశ్వరరావు, ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారులు, పంచాయతీ సిబ్బంది చేత ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ సామెల్ సిబ్బంది పాల్గొన్నారు.